కొత్తపల్లి

తెలుగు పిల్లల ఈ (e) మాసపత్రిక



జూన్ 2011

మూలం: http://kottapalli.in/2010/06

సంపాదకులు: నారాయణ


ముఖచిత్రం: అడవి రాముడు

ఈపుస్తకం ఉబుంటు లైనక్సు వ్యవస్థలో, పూర్తిగా ఓపెన్ సోర్సు ఉపకరణాలను వాడి రూపొందించబడింది.

కొత్తపల్లి ప్రచురణలు

యంఆర్వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి- 515 101, అనంతపురం జిల్లా.

ఫోను: 08559 240222 ఇ-మెయిలు: team@kottapalli.in



విషయ సూచిక

హిరణ్యకశిపుడు...సంపాదకీయం...2

నీతి చంద్రిక...ధారావాహిక...5

పిల్లలు రాసిన కథలు

ఐక్యత...నిర్మలాబాయి...15

బంటి కథ....నాగార్జున...17

చేయూత...ప్రగతి...20

కుందేలు-తాబేలు...పవన్...23

పోలీసు-దొంగ...సంధ్య...25

పొట్టి మునక్కాయ...రాధిక...30

పెద్దలు రాసిన కథలు

సాలెపురుగు-తేనెటీగ...నాగరాజు...33

సాయం...నాగలక్ష్మి...35

దేవునికి టోపీ...ఆదూరి హైమవతి...40

నిజాయితీ...రాధ మండువ...44

తలగుమ్మడి...లలిత...50

అనువాద కథ

ధర్మసంకటం...పర్తాప్ అగర్వాల్...47

పాటలు

తొలకరి జల్లులు...అభ్యాస విద్యాలయం...55

రంగు రంగుల పువ్వులు...వెంకట్రావు...57

క్వాక్ క్వాక్ క్వాక్!...జేజిమామయ్య...58

అవీ ఇవీ

పద రంగం-4...దేవి...60

సమీక్ష- కొత్తపల్లి 37...మాలతీకృష్ణ...61

పెద్దపులి...బొమ్మకు కథ రాయండి...63

హిరణ్యకశిపుడి కథ

హిరణ్యకశిపుడు చాలా పెద్ద రాక్షసుడు. ప్రపంచం మొత్తాన్నీ అదుపులోకి తెచ్చుకోవటం అంటే చాలా ఇష్టం, వాడికి. దానికోసం వాడు తనకు చేతనైన ప్రయత్నాలన్నీ చేశాడు: అన్ని లోకాలనూ గెలిచేశాడు; అన్ని దిక్కుల పాలకుల్నీ పాదాక్రాంతం చేసుకున్నాడు; గాలినీ, నిప్పునీ, నీళ్ళనీ, భూమినీ, ఆకాశాన్నీ- అన్నిటినీ వశం చేసేసుకున్నాడు. అందరూ తను చెప్పిన మాటే వింటున్నారు- తననే పూజిస్తున్నారు దేవుడిలాగా.

అయినా ఏదో వెలితి!

"వీళ్ళంతా ఏదో ఒకనాడు తనకు ఎదురు తిరగచ్చు..!

తనే చనిపోవచ్చు..!

ఇంత గొప్ప వ్యక్తి- తనూ చనిపోవాల్సిందేనా, సామాన్యులలాగా!? తనకు 'చావు' అనేదే లేకపోతే ఎంత బాగుంటుంది! కుదరదు- తను ఎన్నటికీ చనిపోకూడదు"

ఉపాయం ఆలోచించాడు-

"ఈ శక్తి తనకు ఇవ్వగలిగేది ఇద్దరే- బ్రహ్మ, విష్ణువు. ఆ విష్ణువు అల్లరి వాడు- నీతి నియమాల పట్టింపులు ఎక్కువ. అతనికంటే బ్రహ్మే నయం. ప్రాణులన్నిటినీ సృష్టించే శక్తి బ్రహ్మకే ఉంది, నిజానికి. తను ఇప్పుడు ప్రసన్నం చేసుకోవలసింది ఆ శక్తినే..."

"కానీ ఈ బ్రహ్మ కూడా నేరుగా చావు లేకుండా వరం ఇమ్మంటే ఇవ్వడు. మరెలాగ, ఏదో ఒకటి చెయ్యాలి..!"

తపస్సు చేశాడు, బ్రహ్మను గురించి: సృష్టికర్త తన విధి నిర్వహణలో ఏమేం చేస్తాడో వాటినన్నిటినీ అతి సూక్ష్మం వరకూ అర్థం చేసుకునేశాడు- "ఇప్పుడిక తన దారికి రావలసిందే, ఎంతటి బ్రహ్మ

అయినా!"

నిజంగానే వచ్చాడు సృష్టికర్త. రాక్షసుడి ముందు నిలబడి, "ఏం కావాలో కోరుకో, ఇచ్చేస్తాను" అన్నాడు.

"నాకు చావు లేకుండా చెయ్యి!" అన్నాడు హిరణ్యకశిపుడు.

"కుదరదు బాబూ! అదొక్కటీ వీలవదు. వేరే ఏదైనా అడుగు- ఇస్తా" అన్నాడు బ్రహ్మ.


"ఓహో! ఇట్లా ఉందా, నీపని! నేను ముందుగానే ఆలోచించి పెట్టుకున్నానుగా? ఇప్పుడు అడుగుతాను చూడు-" అనుకున్నాడు రాక్షసుడు.

"గాలిలో గాని, భూమి మీద గానీ, మంటలోగాని, నీళ్లలోగాని, ఆకాశంలో గాని, ఏ దిక్కులోగాని, రాత్రి గాని, పగటిపూటగాని, బలం ఉండే పెద్దా-చిన్న జంతువుల చేతగాని, మనుషులు-దేవతలు, లేదా మరే ఇతర జంతువులచేత గాని, ఏలాంటి ఆయుధాలతో గాని మరణం లేకుండా వరంఇవ్వు. అంతే కాదు, నాకు ఎదురులేని శౌర్యాన్నీ, దిక్పాలకులను మించిన బలాన్నీ, మూడులోకాలపైనా గెలుపునూ ప్రసాదించు!" అన్నాడు .

సృష్టి నిర్ఘాంతపోయింది ఈ తెలివికి- అయినా సరే, కానిమ్మంది. రాక్షసుడు కోరిన వరం ఇచ్చేసింది.

ఇంకేముంది? హిరణ్య కశిపుడికి అడ్డులేకుండా పోయింది. ఇంక తనకి చావే లేదని ధైర్యం వచ్చేసింది. సృష్టికర్తనే బురిడీ కొట్టించానని పొంగిపోయింది మనసు. గర్వం, కాఠిన్యం, అతిశయం- అన్నీ వచ్చి చేరుకున్నై. ప్రపంచం అల్లాడి పోయింది. రాక్షసుడు ప్రకృతి నియమాలన్నిటినీ మార్చేశాడు- గతి తప్పి పోయింది సృష్టి. రాత్రింబవళ్ళు, ఋతువులు, కాలాలు- అన్నీ హిరణ్యకశిపుడు ఎట్లా చెబితే అట్లా వస్తున్నాయి. శ్రమ లేకుండా, అన్ని శక్తులూ రాక్షసుల స్వాధీనం అయిపోయాయి.

అయినా ప్రకృతికి, పాపం కష్టం వేసింది. రాక్షసుడిని వేధించేందుకు ఒక కొడుకు పుట్టాడు. ఈయన అవునంటే వాడు కాదనటం మొదలు పెట్టాడు. నీతి నియమాల గురించి- వయసును మించి మాట్లాడుతున్నాడు వాడు. ప్రకృతి నియమాలను మనకి తగినట్లు మార్చుకోవటం కాక, వాటికి లోబడి ఉంటేనే బాగుంటుందనటం మొదలు పెట్టాడు. హిరణ్య కశిపుడికి చికాకు పుట్టించాడు; విపరీతమైన వేదనకు గురి చేశాడు- ఏమంటే, రాక్షసుడు కోరిన కోరికల జాబితాలో 'సంతోషం' లేదు- అదొక్కటీ చేర్చటం మర్చిపోయినట్లున్నాడు!



చివరికి విష్ణువు మనిషీ-జంతువూ కాని నరసింహంలాగా వచ్చి, పగలూ -రాత్రీ కాని సంధ్యా సమయంలో, నేలా-ఆకాశం కాని తన తొడమీద పడుకోబెట్టుకొని, ఇంటా-బయటా కాని గడప మీద కూర్చొని, శస్త్రమూ-అస్త్రమూ కాని తన చేతి గోళ్ళతో చీల్చి చంపేశాడు హిరణ్య కశిపుడిని.

మళ్ళీ ఒకసారి ప్రకృతే గెలిచింది. సర్వ ప్రపంచాధినేతకి కూడా చివరికి తలవంచక తప్పలేదు.

విజ్ఞాన శాస్త్రపు ఆవిష్కరణల్ని లోకహితం కోసం, పొదుపుగా, జాగ్రత్తగా, బాధ్యతగా వాడుకోవటం మన చేతుల్లోనే ఉంది. జపాన్ ఫుకుషిమా అణు రియాక్టరు పేలుడు నుంచి మనం పాఠాలు నేర్చుకోవాల్సి ఉన్నది: హిరణ్యకశిపుడిలాగా పొగరుమోతుతనానికి పోయి అన్నీ పోగొట్టుకో కూడదు. ఈ గాలి, నిప్పు, నీరు, నేల- ఇవన్నీ మనవే! మనం వీటిని ప్రేమగా, ఆప్యాయంగా చూసుకుందాం; బాధ్యతగా కాపాడుకుందాం.

అందరికీ ప్రపంచ పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు.

-కొత్తపల్లి బృందం.



నీతి చంద్రిక-20

సింహం అన్న మాటల్ని మోసుకొని ఎద్దు దగ్గరికి వెళ్తుంది దమనకం. ఎద్దు ఆవేశాన్ని చూసి, అది 'తీతువు పిట్ట-సముద్రం' కథ చెప్పటం మొదలు పెడుతుంది. ఆ కథలో ఆడ పిట్టేమో గూడు మారుద్దామంటుంది; మగ పిట్ట దానికి ధైర్యం చెబుతుంటుంది. అప్పుడా ఆడ పిట్ట దానికి 'తాబేలు-హంసల కథ' చెబుతుంది. హంసలు కొలను విడిచి పోతుంటే నేనూ వెంటవస్తానని పట్టు పడుతుంది తాబేలు.. ఇక చదవండి,. నీతి చంద్రిక ఇరవయ్యవ భాగం.

మూలం: కీ.శే. పరవస్తు చిన్నయ సూరి. *సరళీకరణ: ఘడియారం వేంకట నారాయణ శర్మ.*


అప్పుడు హంసలు రెండూ కూడా విచారపడి, కొంచెం ఆలోచించి- "ఇదెట్లా వీలౌతుంది? ముక్కున కరచుకొని పోవాలి, లేకపోతే రెక్కలమీద ఎక్కించుకొని పోవాలి. ఈ రెండూ మావల్ల అయ్యే పనులు కావు. మేము దూరదేశాలకు పోవలసిన వాళ్లం. సాహసం పనికిరాదు. ఎటు పోయి ఎటు వస్తుందో తెలియదు. మా మాట విను- మనసును గట్టి

చేసుకొని, నీ స్థానంలో నువ్వు, కదలకుండా ఉండిపో. అదృష్టం బాగుంటే మళ్ళీ కలుస్తాం" అని ఎన్నో రకాలుగా చెప్పాయి. అయినాకూడా తాబేలు తను పట్టిన పట్టును వదలలేదు. "నన్నూ మీ వెంట తీసుకొని పోండి" అని పీడించింది వాటిని.

చివరికి అవి నిస్సహాయతతో మరికొంత ఆలోచించి, "ఒక దారి కనబడుతున్నది- మనసుకి కొంచెం సరిపోయేట్లు తోస్తున్నది. ఏదైనా ఒక కట్టె ముక్కను సంపాదించి, దాని చివరలను చెరొక ప్రక్కనా ముక్కుతో కరచిపట్టుకొని పరుస్తాం- నువ్వు ఆ కట్టెను మధ్యలో జాగ్రత్తగా పట్టుకొని, వ్రేలాడుతూ రాగలవా? ఏమరు పాటు కూడదు, మరి?" అన్నాయి.

"ఓః.. దానిదేముంది?!" అని సంతోషంతో ఉబ్బిపోయింది తాబేలు. ఆ కట్టెను పట్టుకొని మధ్యలో వ్రేలాడుతూ పోయింది.

అట్లా ఆ హంసలు రెండూ తమ ముక్కుల్లో కట్టెపుల్లను పొందు పరచుకొని ఆకాశంలో వేగంగా ఎగురుతూ పోతుంటే, క్రింద ఒక పట్టణంలో జనాలు వీటిని చూసి ఆశ్చర్య పడి, గందరగోళంగా అందరూ వీధుల్లో చేరి అరుస్తూ, గంతులు వేస్తూ, పైకి చేతులెత్తి చూపుతూ, చప్పట్లు కొడుతూ, ఈలలు వేస్తూ, హడావిడి చేయటం మొదలు పెట్టారు.




హంసలు వాళ్ళనెవరినీ పట్టించుకోకుండా తమ దారిన తాము వేగంగా ఎగురుతూ పోయాయి- కానీ వాళ్ల సందడి బాగా వినబడేసరికి తాబేలుకు కుతూహలం హెచ్చింది. చివరికి అది తన ఉబలాటాన్ని ఆపుకోలేక, "ఏమిటా శబ్దం?" అని తన మిత్రుల్ని అడిగేందుకని నోరు తెరచింది- ఇంకేముంది? మరుక్షణం అది పట్టు తప్పి నేలన పడటం, క్రిందనే వేచి ఉన్న

మాంసప్రియులు దాన్ని వండుకొని తినెయ్యటం వెనువెంటనే జరిగిపోయాయి!

అందుకని, తెలివి గలవాడు అనర్థాన్ని తెచ్చిపెట్టే పనులను అసలు నెత్తికి ఎత్తుకోనే కూడదు- ఒక వేళ అనర్థం ఏదైనా వాటిల్లినప్పుడు, కనీసం ఏదో ఒక ఉపాయంతో అపాయాన్ని తప్పించుకొనే శక్తి ఉండాలి. అంతేకానీ, ఈ రెండూ చేయకుండా దేవుడిమీద భారం వేస్తే ముప్పు తప్పదు. నీకొక కథ చెబుతాను, విను- అది వింటే, నా మాటల్లోని సత్యం నీకే తెలిసివస్తుంది:

దైవపరుడికి ఆపద :



"అనగా అనగా ఒక కొలనులో 'అనాగత విధాత, ప్రత్యుత్పన్న మతి, అధ్బవిష్యం' అనే మూడు చేపలు నివసిస్తూ ఉండేవి. ఒకరోజున అనాగత విధాత మిగిలిన రెండు చేపలతో "ఈ ఏడాది ఎందుకో, ఇంతవరకూ వానలు కురవలేదు. ఇక మీదట కూడా కురుస్తాయని ఆశలేదు. శకునాలన్నీ వ్యతిరేకంగానే కనబడుతు-న్నాయి. ఈ కొలనులో నీళ్లు పూర్తిగా అడుగంటక ముందే తెలివి తెచ్చుకోవాలి. ఆలస్యం చేశామంటే అనర్థం తప్పదు. ఇక్కడికి కొంత దూరంలో "ధ్రువోదం" అనే చెరువొకటి ఉన్నది. అందులో నీళ్లు ఎప్పటికీ అడుగంటవని ప్రతీతి. ఈ కొలనులోకి నీళ్లు తెచ్చే మొరవ వచ్చేది ఆ చెరువు నుండే! ఇంకొంతకాలం గడిచిందంటే ఆ మొరవ కూడా ఎండిపోగలదు- అందువల్ల ఇవాళ్ల నడిరాత్రిన, మెల్లగా ఆ మొరవలోకి ఎగిరి, ఎలాగో ఒకలాగ ఆ చెరువును చేరుకున్నామంటే ఈ కష్టాలు తప్పుతాయి: కొంతసేపటి క్రితం కొందరు జాలరివాళ్లు వచ్చారిక్కడికి - ఈ కొలనులోని నీళ్లను చూసి "పదిరోజుల్లో ఇది ఎండిపోతుంది. అప్పుడు వద్దాం" అని ఒకరితో ఒకరు చెప్పుకుంటూ

పోయారు! అది విన్నప్పటి నుండీ నా మనసు మనసులో లేదు" అన్నది.

అనాగత విధాత చెప్పినది విని, ప్రత్యుత్పన్నమతి "దీనికి ఇంత ఆందోళన ఎందుకు? అంతగా మీదపడితే, అప్పుడే చూసుకుందాములే!" అన్నది. ఇక అధ్భవిష్యుడైతే ఏమీ అనను కూడా అనలేదు.



అయినా ఆ రోజు రాత్రి చీకటి పడగానే అనాగత విధాత కొలనులోనుండి బయటపడి, మొరవలోకి దూరి, మెల్ల మెల్లగా ప్రయాణించి ధ్రువోదాన్ని చేరుకున్నది.

రానురాను ఎండలు అధికమయ్యేసరికి, కొలనులో నీరు ఇంకిపోసాగింది. అడుగున ఇక ఏ కొద్ది పాటి నీళ్లో మిగిలాయి- అది గమనించిన జాలరులు ఒకనాడు వల, ఎత్తెల, కొడమ, గర్రె, మావు మొదలైన సాధనాలన్నీ తీసుకొని వచ్చిపడ్డారు. చాలా సంబరంగా కొలనులోకి దిగి, వలవేసి, చేపలన్నిటినీ పట్టుకొనటం మొదలు పెట్టారు. అధ్భవిష్యం వలలో చిక్కుకొని ఎగిరెగిరి పడటంతో, వాళ్లు దాన్ని వేరుచేసి, చంపి, ప్రక్కన పడేశారు!

ప్రత్యుత్పన్నమతి అప్పటికప్పుడు ఒక ఉపాయం ఆలోచించింది. చచ్చినదానిలాగా నీళ్లలో వెల్లకిలా పడి, తేలసాగింది. చేపలవాళ్లు దాన్ని చూసి, 'నిజంగానే చచ్చింది' అనుకున్నారు. దాన్ని తీసి నీటి అంచుకు దగ్గరగా పారేసారు. ఆ పైన కొలనులోని చేపలన్నిటినీ ఒక్కటీ మిగలకుండా పట్టుకొని పోయారు. తెలివిగల ఆ చేప మెల్లగా కొంచెం కొంచెం జరిగి, నీళ్లలో పడి, తప్పించుకొని పోయింది!"

ఆడ పక్షి ఈ కథను చెబితే విని, మగపక్షి - "అయ్యో! నువ్వు దీని కోసం అంత బాధపడవెందుకు? 'వీడువట్టి అబద్ధాలకోరు' అనుకోకు. అవసరం పడ్డప్పుడు నా శక్తి

సామర్థ్యాలను చూపించి, నీ మెప్పు పొందుతాను- ప్రస్తుతానికి ఊరుకో' అన్నది. ఆడపక్షి భర్తకు ఎదురుచెప్పటం ఇష్టం కాక, ఊరుకున్నది.



ఆ తర్వాత కొన్ని రోజులకు పక్షి గుడ్లు పెట్టింది. అది చూసి సముద్రుడు అనుకున్నాడు- "ఓహో! ఈ మగపక్షి ఎన్నెన్ని మాటలన్నది! ఇప్పుడు చూపమంటాను, దీని శక్తి ఏపాటిదో!" అని భయంకరంగా అలలు రేపాడు. అవి నిజంగానే ఆకాశమంత ఎత్తుకు ఎగసి, ఒక్కసారిగా చెట్టును ముంచెత్తాయి. పక్షి గుడ్లన్నీ సముద్రుడి పాలబడ్డాయి!

"నేను ఎంత చెప్పినా వినలేదు కదా, నువ్వు?! చూడు ఏమైందో! ఇక నేనేమి చెయ్యాలి?!" అని బొటబొటా కన్నీళ్లు కార్చింది ఆడపక్షి. మగపక్షి దానిని ఊరడించింది. పక్షిజాతులను అన్నిటినీ ఒక్క చోటికి పిలిచింది. సముద్రుడు తనను కావాలని ఏ విధంగా బాధించాడో వివరించింది: "మిత్రులారా! ఈ ప్రపంచం మొత్తాన్నీ- దాన్ని ఆవరించి ఉండే నీటితో సహా అంతటినీ- పుక్కిలించేసేంత పరాక్రమవంతుడు గదా, మన రాజు- గరుత్మంతుడు?! ఆ సంగతి తెలీదు కాబోలు, సముద్రుడికి. ఇప్పుడు అతనికి ఆ సంగతి తెలియజెప్పాలి. లేకపోతే ఇక అతని గర్వానికి హద్దులుండవు. 'ఇంత చిన్న విషయానికి అంత ఉద్యమం ఎందుకు?' అని తీసిపారేయకండి. ఇవాల్టికి ఇది గోరంతనే, రేపటికి ఇదే కొండంత సమస్య అవుతుంది- మనందరం మనసు పెట్టి, వినతా సుతుడైన ఆ గరుత్మంతుడిని ప్రార్థిద్దాం. ఆయనే మన ఆపదల్ని పోగొట్టి సముద్రుడికి బుద్ధి చెబుతాడు" అన్నది.

పక్షులన్నీ తమతోటి పక్షికి కలిగిన ఆపదను, దాని స్వభావాన్ని గుర్తించినై. అన్నీ భక్తితో తమ

ప్రభువు గరుత్మంతుడిని ధ్యానించగానే ఆ స్వామి ప్రత్యక్షమై "మీకందరికీ ఏదో పెద్ద సమస్యే వచ్చినట్లుంది. నన్నెందుకు తలచుకున్నారో చెప్పండి. మీ సమస్యను పరిష్కరిస్తాను" అన్నాడు.



తమకు సముద్రుని వల్ల కలుగుతున్న కష్టాన్ని వివరించినై, పక్షులన్నీ. అది విని ఆయన చాలా బాధపడి, వెంటనే సముద్రుడిని అక్కడికి రప్పించాడు: "వీళ్లంతా నా వాళ్లు! ఇకమీద మా వాళ్లకెవరికీ హాని చెయ్యకు! నీకిది సమంజసం కాదు. ఇప్పటికి జరిగినదాన్ని క్షమిస్తున్నాను- అయితే ఇకమీద ఇటువంటివి జరగరాదు" అని సముద్రుడికి చెప్పి, గరుత్మంతుడు మాయం అయిపోయాడు. సముద్రుడికి అట్లా గర్వం అణిగింది"

-అని చెప్పింది దమనకం.

అదివిని ఎద్దు-సంజీవకం "దమనకా! విను. మనం ఎల్లకాలమూ బ్రతకం కదా! ఏదో ఒకనాడు చావు తప్పదు. మన కళ్లముందే పుట్టి, చచ్చిపోయిన వాళ్లు ఎందరు లేరు? నిన్న ఉన్నవాడు ఈరోజు ఉండాలని లేదు. ఇవాళ్ల శత్రువుకు వెన్ను చూపవచ్చు, కానీ రేపు మృత్యువుకి వెన్ను చూపలేము కదా? పారిపోవటం వల్ల అపకీర్తి తప్ప వేరే ఏమి వస్తుంది? శత్రువు బలాన్ని ఎంచక మాట్లాడే వాడిని కాదు, నేను. ఆ శతృవు బలం చాలా ఎక్కువ అవ్వటం వల్లనే గదా, నేను ఇలాంటి నిర్ణయానికి వస్తున్నది? చివరిమాట ఒకటి చెబుతాను, విను! నా ప్రాణం పోయినా సహిస్తాను గానీ, నా వ్యక్తిత్వం మీద ఒక్క మచ్చ పడ్డా సహించను- నిజంగా చెబుతున్నాను- నువ్వు ఇక నా నిర్ణయానికి అడ్డురాకు. నేను నీ వెనువెంటనే వచ్చేస్తాను- 'సిద్ధంగా ఉండమని ప్రభువుకు చెప్పు. త్వరగా

పో! లే, లేచిపో! వెంటనే!" అన్నది దానిని త్వరపెడుతూ.

దమనకుడు అక్కడి నుండి లేచి పరుగున సింహం దగ్గరికి పోయేది కాస్తా, రాజమహలు ద్వారం దగ్గరే తచ్చాడుతున్న కరటకుడిని చూసి, ఆగి "లోపలికి పోవచ్చా? తగిన సమయమే గదా!" అన్నది." ఓహో!పోవచ్చు! సరైన సమయమే! ప్రభువు నీ రాక కోసమే వేచి చూస్తున్నాడు. ఇంతకీ పోయిన పని ఏమయింది?" అని అడిగింది కరటకం. "వేరేది ఎందుకవుతుంది? వెళ్ళిన పనిని పండించుకొని వచ్చాను. సంగతంతా మళ్ళీ చెబుతాను. నువ్వు పోయి ప్రభువుల వారి దగ్గర నిలబడు. కొంచెం సేపటికి నేను వస్తాను" అన్నది దమనకం.

కరటకం లోపలికి వెళ్లాక కొంతసేపటికి మెల్లగా అది లోపలికి వెళ్లింది. దాని కోసమే ఎదురుచూస్తున్న సింహం దాన్ని పిలిచి "రా, కూర్చో! ఏమైంది?" అని అడిగింది. కరటకం సింహం దగ్గరకు పోయి మోకాళ్లపై కూర్చొని "నేను వెళ్లే సరికి సంజీవకుడు ఇంటి లోపల కాటక పాటకులతో మాట్లాడుతూ ఉన్నాడు. నన్ను చూడగానే అతను వాళ్లతో మాట్లాడటం ఆపి, నన్ను ఆహ్వానించి, కూర్చోబెట్టి కుశల ప్రశ్నలు వేశాడు. సందర్భానికి తగినట్లుగా నేనూ ఏవో కొన్ని మాటలాడాను. మేం ఇద్దరం ఏకాంతంగా ఏవో చర్చించాలని గుర్తించి, కాటకపాటకులు ఇద్దరూ కొంచెం ఎడంగా పోయారు.




అప్పుడు నేను ఏమేమి చెప్పాలో అవన్నీ నయానా, భయానా చెప్పాను. అతను కూడా తను చెప్పాలనుకున్న వాటిని చెప్పేశాడు- మొండిగానూ, సాహసంగానూ. అవన్నీ నేను చెప్పాల్సినవి కావు; మీరు వినాల్సినవీ కావు- లాభం కూడా ఏమీ లేదు. అతను

మాట్లాడిన తీరును బట్టే 'అతని ప్రయత్నం మొత్తం మనకు వ్యతిరేకంగా ఉన్నది' అని అర్థమైపోయింది.

అయినా చాలా కాలంగా అతనితో స్నేహంగా మెసిలిన వాడిని కనుక, అతని మాటలను, అతను చేయతలపెట్టిన పనులను భరించలేక, అతనికి ఏది మేలో , నాకు తోచినంతగా ఒత్తి చెప్పాను. ఎంత చెప్పినా అతను మాత్రం "తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు" అంటున్నాడు. 'వినాశకాలే విపరీత బుద్ధి:'- పోగాలంలో పాడుబుద్ధి పుడుతుందట- నిజమే అనిపించింది, అతన్ని చూస్తే. చివరికి అతను తన తెగింపును, యుద్ధానికి దిగాలన్న నిశ్చయాన్నీ స్పష్టంగా చెప్పి - "ఇక నా నిర్ణయానికి అడ్డురాకు! నేను నీ వెనువెంటనే వచ్చేస్తున్నాను; సన్నద్ధంగా ఉండమని ప్రభువుకు చెప్పు! లే! పో!" అన్ని ఎంతో పొగరుమీరగా చెప్పాడు. ఈసరికి అతను పోరాటానికి ఇక్కడికి వచ్చేస్తూ ఉంటాడు. ఇప్పుడిక అతనిని ఏం చేయాలో దేవరవారికి తెలుసు" అన్నది.

అదివిని సింహం "అహహా! ఎంత సాహసం! ప్రళయకాలపు మంటలపైకి మిడుత దూక బూనింది! ఔరా! ఎంత పొగరు!" అని అరిచింది. ఆ ఆలోచనకే దాని మనసులో చెప్ప వశం కాని కోపం చెలరేగింది. శత్రువును శిక్షించాలన్న నిశ్చయంతో అది ఒక్క ఉదుటున లేచి, బయటికి పరుగెత్తి నిలబడింది. అంతలో గిట్టల తాకిడికి దుమారం ఆకాశమంత ఎత్తుకు లేస్తూ పోతుంటే, 'మేఘాలు నిరాటంకంగా పైకి లేస్తున్నాయేమో' అనిపించేట్లు, భూమి అదిరేట్లు, పరమ భీకరమైన ఆకారంతో పరుగు పరుగున వస్తూ కనబడ్డది సంజీవకం . ఆ సమయంలో సింహం అరచిన అరుపుకు కొండలన్నీ కంపించి ప్రతిధ్వనించాయి. కోపంతో ఎర్రబారిన దాని పసుపు పచ్చకళ్ళలో నిప్పు కణికలు చెలరేగాయి. గుహలాంటి తన నోటిని పూర్తిగా తెరచి, వంకర తిరిగిన కోరలన్నిటినీ చాపి, మెత్తని నాలుకను అల్లల్లాడిస్తూ ఆ సింహం ఒక్క పెట్టున ఎద్దు మీదికి దూకింది.

సంజీవకం ఆ దెబ్బనుండి తప్పించుకొని, తోకను గిరగిరా తిప్పుతూ, వెనక కాళ్లతో నేలను తాటిస్తూ, ఎగిరెగిరి దుముకుతూ, భూమికి -ఆకాశానికి మధ్య గల వాతావరణం అంతా దద్దరిల్లి పోయేటట్లు గొప్ప శబ్దంతో రంకె వేస్తూ, తలవాల్చి, కొమ్ముల్ని ఏటవాలుగా వంచి, మెరుపు మెరిసినట్లు పరుగెత్తి వచ్చి, సింహాన్ని కొమ్ములతో కుమ్మింది. ఆ దెబ్బకు సింహరాజంతటిదే సొమ్మసిల్లి పడిపోయింది.



అయితే అది అంతే త్వరగా తేరుకొని, కోపం ఆవేశించగా ఫెళ్లుమని గర్జించి, ఒక్క ఉదుటన దూకి, వజ్రాలతో సమానమైన గోళ్లను చాపి, పంజాతో ఎద్దు మూపురాన్ని చరిచింది. ఆ వేటుకు పెల్లుబికిన ఎద్దు రక్తం- కొండమీది నుండి పారే సెలయేళ్ల ధారల్ని తలపించింది! అయినా సంజీవకుడు ప్రక్కకు తొలగక, క్రిందికి వంగి, వాడి కొమ్ముల్ని ఒక్క పెట్టున సింహం కడుపులో గుచ్చింది. సంజీవకుని ఆ వేటుకంటే, 'అతను తనను అవమానించాడే' అన్న భావన గుండెల్ని అదిరించగా సింహరాజు బలహీనుడై, కట్టె దెబ్బ పడిన త్రాచు పాము మాదిరి రొప్పుతూ నిలబడిపోయింది!

అది చూసి కరటకుడు దమనకుడితో "చూశావా? నీ దురాలోచనను విన్నందుకు ఫలితం ఇప్పుడు మన రాజు అనుభస్తున్నాడు! మొదట నువ్వే సంజీవకుడికి సింహరాజుతో స్నేహం పుట్టించావు. తర్వాత వాళ్లిద్దరి స్నేహానికీ కళ్లు కుట్టి, నువ్వే వాళ్లిద్దరి మధ్యనా చిచ్చుపెట్టావు; ముందు చూపు లేనట్లు వ్యవహరించావు. పండితుడు కాకపోయినా తనను తాను 'పండితుడు' అనుకునేవాడు తనకే కాదు, తన యజమానికి కూడా ప్రమాదం తెచ్చి పెడతాడు. అయ్యయ్యో!

మన రాజు ఇప్పుడు గొప్ప ఆపదలో ఉన్నాడు. ఆయనను ఈ కష్టం నుండి గట్టెక్కించే మార్గం కనుగొంటేనే కదా, సమర్థులమయ్యేది!

బింకం కొద్దీ డాంబికంగా ఎన్నిమాటలైనా చెప్పచ్చు కానీ, నిజంగా కష్టం వచ్చినప్పుడు పనిని నెత్తిమీద వేసుకొని సంబాళించటం అంత సులభం కాదు.

కమలాలతో ఎంత అందంగా ఉన్న సరస్సునైనా సరే, మొసళ్లు ఉన్నాయంటే చాలు, అందరూ విడచి పెడతారు. అదే విధంగా రాజు ఎంత మంచివాడైనా సరే, దుర్మార్గుల సహవాసం చేస్తున్నాడంటే ఆయనకు దగ్గరయ్యేందుకు ప్రజలందరూ భయపడతారు-..” అన్నది.

(...మిగతాది మళ్ళీ..)

దొందూ దొందే!

జోకులు

తండ్రి: అబ్బాయి నచ్చాడా అమ్మా!

కూతురు: నచ్చాడు కానీ కొంచెం.. నవ్వినప్పుడు పళ్ళు ఎత్తుగా కనిపిస్తున్నాయి నాన్నా!

తండ్రి: నిన్ను చేసుకున్నాక ఇంకెక్కడ నవ్వుతాడు లేమ్మా, ఈ సంబంధాన్నే ఖరారు చేస్తాను.

***

పేరయ్య: అమ్మాయి నచ్చిందా, బాబూ?

అబ్బాయి: నచ్చింది, కానీ ఒక్కటే సమస్య.. నవ్వినప్పుడు పళ్ళు ఎత్తుగా కనిపిస్తున్నాయి గదండీ.

పేరయ్య: నిన్ను చేసుకున్నాక ఇంకెక్కడ నవ్వుతుంది లేవయ్యా, ఈ సంబంధాన్నే ఖరారు చేస్తాను.

సేకరణ: సుచరిత



ఐక్యత

కథల్లో ఎప్పుడూ వేరేవాళ్ళే ఉండనక్కర్లేదు. మన కథల్లో మనమూ పాత్రలుగా ఉండచ్చు. అయితే సాధారణంగా పిల్లలకు ఇలా 'నేను-నేను' అని కథలు రాయటం రాదు. నిర్మలాబాయికి వచ్చు! ఈ కథ మీకూ తెలిసినదేనేమో మరి- చదివి చెప్పండి,

కథనం: పి.నిర్మలాబాయి, 9 వతరగతి,ఎ.పి.ఆర్.ఎస్.దిగ్వాల్.

సౌజన్యం: జహీరాబాద్ పిల్లల కథలు, మనలైబ్రరీ, జహీరాబాదు.

గత ఆరు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు. ఫలితంగా తెగి పడిన కరెంటు తీగలు, స్తంభాలు, నేలకొరిగిన వృక్షాలు! ఎలాగ?- మరొకగంటలో ఊరికి దూరంగా ఉన్న స్టీల్ ప్లాంట్ హైస్కూల్‌కి చేరుకుని, నగర స్థాయి టాలెంట్ టెస్టులో పాల్గొనాలి! అమ్మా,నాన్న ఇద్దరూ డాక్టర్లు కావడంతో ఉదయం ఎనిమిది గంటలకే క్లినిక్‌కు వెళ్లిపోయారు. ఎనిమిదిన్నరకు కారు పంపిస్తామన్నారు; కానీ తొమ్మిదవుతున్నా కారు రాలేదు!

సరిగ్గా అప్పుడే ఆపద్బాంధవుడిలా వచ్చాడు రాధాకృష్ణ మామయ్య. ఆయన కూడా డాక్టరే. నా గోడంతావిని, "నేనూ అటే వెళ్తున్నా. నా కారులో డ్రాప్ చేస్తాను- పద" అన్నాడు. 'హమ్మయ్య' అనుకుంటూ వెళ్ళి కూర్చున్నాను మామయ్య కారులో . ఇంకా హైవే కూడా చేరుకోకముందే ఆగిపోయింది మా కారు! ఒక్క మా కారే కాదు- చాలా వాహనాలు ఆగిపోయివున్నాయి... కారణం? తుఫాను తాకిడికి రోడ్డుకు అడ్డంగా నేలకొరిగిన వేపచెట్టు!

చేసేదేమీ లేక, నేను కూడా అక్కడే నిల్చున్నాను. కానీ నిలబడి ఏం ప్రయోజనం? ఏదో చెయ్యాలి..ఏం చేయాలో తెలీదు.. అంతలో నా మనసులో తళుక్కుమంది ఓ ఆలోచన. 'హెల్ప్' అని అరుస్తూ, రోడ్డు మధ్యగా వెళ్లి, చెట్టును గట్టిగా పట్టుకుని కదిలించబోయాను. అరంగుళం కూడా కదల్లేదు ఆ చెట్టు.

కానీ 'ఏమైంది? ఏమైంది?' అంటూ నా దగ్గరకు పరుగు పరుగున వచ్చారు ఓ నలుగురు. నాకేం కాలేదంకుల్- అటు చూడండి, ఓ సారి! చచ్చిన ఆ బల్లిని చీమలన్నీ కలిసి ఎలా లాక్కుపోతున్నాయో?! అలాగే మనమంతా కలిసి ఈ చెట్టును పక్కకు నెట్టలేమా?' అడిగాను నేను.

వాళ్లలో కదలిక మొదలైంది. మామయ్యతో పాటు మరో నలుగురు నాకు సాయంగా చెట్టును కదిలించసాగారు. తరువాత మరో నలుగురు..ఆపైన ఇంకోనలుగురు..కొంచెం కొంచెంగా చెట్టు కదలటం మొదలు పెట్టింది. అంతలో మరింతమంది యువకులు చేరారు. అందరి బలం ముందు చెట్టు బరువు ఏపాటిది? అడ్డం తొలగిపోయింది. క్షణాల్లో క్లియరైపోయింది ట్రాఫిక్ జామ్.

"శెహభాష్ రా, వాసూ! నీ టాలెంట్‌ని ఇక్కడ కూడా చూపించావ్!" నా భుజం తడుతూ అన్నాడు రాధాకృష్ణ మామయ్య.

గర్వంతో మెరిసాయి నా కళ్లు.

కొద్ది సేపట్లో మేమెక్కిన కారు కదిలి ముందుకు దూసుకుపోయింది.



బంటి కథ

రచన: బి.నాగార్జున,10 వతరగతి, పాలపిట్ట బాలల సంఘం, చెన్నేకొత్తపల్లి.

అనగనగా ఒక పల్లె. ఆ పల్లెలో ఉండే సూరి, జ్యోతిల సంతానం బంటి. సూరి ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. బంటి పదో తరగతి చదివేవాడు. సంక్రాంతి సెలవులు రాగానే బంటికి ఆటోడ్రైవింగు నేర్పాడు సూరి. ఒకసారి ఆటో నడపటం నేర్చుకున్నాక, బంటీ కూడా వాళ్ళ నాన్నకు అప్పుడప్పుడూ ఆటో నడపటంలో సహాయం చేయసాగాడు.

బంటి పరీక్షలు బాగా రాశాడు. పదవతరగతిలో 560 మార్కులతో పాఠశాలకు మొదటి స్థానం సాధించాడు. కాలేజిలో చేరాలని నిశ్చయించుకున్నాడు. వాళ్ల నాన్న మాత్రం 'నువ్వు ఆటో బాగా నడుపుతావురా; చదువుల్లో ఏమొస్తుంది? ఆటో తోలుకో, చాలు" అని సలహా ఇచ్చాడు. బంటి

ఊరుకోలేదు. బాగా పోరి, వాళ్ల నాన్నను ఒప్పించాడు: కాలేజికి వెళ్లటం మొదలుపెట్టాడు. వాళ్ల ఊళ్ళో కాలేజి లేదు. ఆటోలు నడిపేవాళ్లంతా తనకు పరిచయస్తులే- అందుకని రోజూ ఏ ఆటో కనబడితే ఆ ఆటోలో డ్రైవరు పక్కన కూర్చొని పొరుగూర్లో ఉన్న కాలేజికి వెళ్తున్నాడు.

ఒకరోజు బంటి అట్లా ఆటోలో ప్రయాణిస్తుండగా డ్రైవర్ ఫోన్ మోగింది. ఒక చేత్తో ఆటో నడిపిస్తూనే, వేరొకచేత్తో ఫోన్ తీసి మాట్లాడడం మొదలుపెట్టాడు, డ్రైవరు. బంటి మాత్రం డ్రైవర్ పక్కన కూర్చొని పాటలు వింటున్నాడు.



అంతలో ఏమైందో తెలీదు- డ్రైవర్ ఆటోను వదిలేసి, ఛాతీని నొక్కుకుంటూ ప్రక్కకు ఒరిగిపోయాడు. ఆటో అదుపు తప్పి, రోడ్డు పక్కనే ఉన్న కాలవ వైపు వెళ్తోంది! ఒక్క క్షణం పాటు బంటికి ఏం జరుగుతోందో అర్థం కాలేదు. అర్థం కాగానే ఒక్క ఉదుటున ముందుకు దూకి ఆటోని అదుపులోకి తీసుకున్నాడు. డ్రైవరు నిశ్చేష్టుడై పడి ఉన్నాడు ఇంకా- ఒకసారి అతన్ని చూడగానే బంటికి అర్థమైంది- అతనికి గుండెపోటు వచ్చి ఉంటుందని! వెంటనే ఆటోని ముందుకు దూకించి దగ్గరలోనే ఉన్న ఆసుపత్రి వైపుకు బయలుదేరాడు.

అది ఎన్నికల సమయం. ఆసుపత్రికి వెళ్తున్న దారిలోనే పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల ప్రచారం కోసం ముఖ్యమంత్రిగారు వస్తున్నారు. అన్ని వైపులా భారీ బందోబస్తు! బంటి చిన్నవాడు- ఇంకా ఆటో నడిపే అర్హత లేదు; అందులో కూర్చున్న ప్రయాణీకులెవ్వరికీ ఆటో నడపటం రాదు! పోలీసులను చేరుకోగానే బంటి ఆటోను నిలబెట్టి, గబగబా వాళ్ల దగ్గరకి వెళ్ళాడు: "సార్

డ్రైవర్‌కు గుండెనొప్పి వచ్చింది-ఆసుపత్రి-" అని చెప్పేలోపే ముఖ్యమంత్రి గారి కార్లు అక్కడికి వచ్చి వాలాయి. అంతలోనే ముఖ్యమంత్రిగారు క్రిందికి దిగి సంగతేంటని విచారించారు. ఆటో డ్రైవరును త్వరగా ఆసుపత్రికి తీసుకెళ్లమని అధికారులను ఆదేశించారు. బంటిని కూడా తనతో పాటు రమ్మని సభకు పిలుచుకుపోయారు.

"మనం సంఘ జీవులం- అంటే పదిమందితో కలిసి బ్రతికేవాళ్లం. ఒకరికొకరు సహాయం చేసుకోవాలి. 'ఈపని నాది కాదు; ఆపని నాది కాదు' అని మడి కట్టుకొని కూర్చుంటే వీలవ్వదు. ప్రతివాడూ ముందుకొచ్చి ఈ బంటి మాదిరిగా సమయస్ఫూర్తితో అందరికీ మేలు చేసే పనులను చేపట్టిన రోజున మన దేశంలో పేదరికం అన్నదే లేకుండా పోతుంది" అని ప్రసంగించారు. ఆటో డ్రైవర్‌ను, ప్రయాణీకులను సమయస్ఫూర్తితో రక్షించి-నందుకుగాను బంటి పేరును 'సాహస బాలల పురస్కారం' కోసం సిఫారసు చేశారు.

ఆ సంవత్సరం ఆగస్టు15 వ తేదీన, రాష్ట్రపతి సమక్షంలో బంటికి సాహస బాలల పురస్కారం లభించింది.

మెడల్ కొట్టేశా!

జోకు

కొడుకు(ఫోన్లో): నాన్నా! నేను చైనా ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ కొట్టేశాను. ఒక ఐదు లక్షల రూపాయలు పంపించు.

తండ్రి: చాలా సంతోషం నాయనా, ఇప్పుడెక్కడున్నావు?

కొడుకు: చైనాలో నన్ను వీళ్ళు జైల్లో పెట్టారు నాన్నా. ఇప్పుడు అక్కడే ఉన్నాను.

తండ్రి(గాభరాగా): అదేంటిరా! గోల్డ్ మెడల్ కొట్టిన వాళ్లని జైల్లో పెడతారా వాళ్ళు?

కొడుకు(అమాయకంగా): అదే నాన్నా, నేనూ అడుగుతున్నాను. పక్కవాడికి వచ్చిన మెడల్‌ను కొట్టేస్తే జైల్లో పెడతారట ఇక్కడ! నాకేం తెలుసు ఆ సంగతి?

సేకరణ: సుచరిత



చేయూత

'ఆకలి అందరికీ అవుతుంది; కానీ అన్నం అందరికీ ఎందుకుండదు?' అని ప్రగతి అడిగిన ప్రశ్నకు టీచరుగారు కూడా సరైన జవాబివ్వలేదు నిజానికి. అయినా 'ఆ చిన్ని మెదడు ఇంత ఆలోచించిందే' అని, కథకాని ఈ కథకు అంతం కాని అంతాన్ని కల్పించి పెట్టేసి ప్రచురించేస్తున్నాం మేమే. మీకెవరికైనా ఆ ప్రశ్నకు సమాధానం తెలిస్తే చెప్పండి...

ప్రశ్న: ఆర్.ప్రగతి, 8 వతరగతి, హైస్కూల్, వెంకటంపల్లి.

వెంకటంపల్లిలో నివసించే మహేంద్రది ధనిక కుటుంబం. వాడు శారదా హైస్కూల్లో చదువుకుంటున్నాడు. వాళ్ల ఇంటి ప్రక్కనే ఉన్న గుడిసెలో రాజు, వాళ్ళ అమ్మ-నాన్న నివసించేవాళ్ళు. వాళ్ళది పేద కుటుంబం. రాజు స్థానికంగా ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్లో చదువుకుంటున్నాడు. ఒకడు ధనికుడు, ఒకడు పేదవాడు అయినా మహేంద్ర, రాజు మాత్రం మంచి స్నేహితులే. మహేంద్ర వాళ్ళ ఇంటి ప్రక్కన ఉన్న స్థలంలోనే పిల్లలంతా క్రికెట్ ఆడుకునేవాళ్ళు.

రాజు వాళ్ళ నాన్నకు ఆరోగ్యం సరిగా ఉండదు.

ఇల్లంతా గడిచేది వాళ్ళ అమ్మ రెక్కల కష్టం మీదే. ఒక రోజున పిల్లలంతా క్రికెట్ ఆడేందుకు వచ్చారు, కానీ రాజు మాత్రం ఎంతకీ రాలేదు. 'ఎందుకు రాలేదు?' అని చూడటానికి రాజు వాళ్ళ ఇంటికి వెళ్ళాడు మహేంద్ర.

అక్కడ రాజు అడుగుతున్నాడు వాళ్ళమ్మను - "అమ్మా! అన్నం పెట్టివ్వమ్మా" అని.



"అన్నం అయిపోయింది బాబూ! ఈ రోజుకు ఎలాగైనా ఈ నీళ్ళతో గడుపు. రేపు ఎవరినైనా అడిగి తీసుకువస్తాను" అంటోంది వాళ్ళమ్మ.

మహేంద్ర ఇదంతా విని వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు. కానీ ఆనాటినుండీ ఒక ఆలోచన అతన్ని మళ్ళీ మళ్ళీ వేధించింది: 'ఆకలి అందరికీ ఉంటుంది,కానీ అన్నం అందరికీ ఎందుకు ఉండదు?'

ఒక రోజున వాళ్ల నాన్న కొంచెం తీరికగా కనబడితే, ఆయన్ని అడిగాడు మహేంద్ర- "ఆకలి అందరికీ ఉంటుంది గదా నాన్నా, మరి అన్నం అందరికీ ఎందుకు ఉండదు?'అని. వెంటనే వాళ్ల నాన్నకు కోపం వచ్చేసింది: "ఆ రాజుతో నువ్వు ఉండటం వల్లనే కదా, నీకు ఈ పిచ్చి పిచ్చి సందేహాలన్నీ వస్తున్నాయి? ఇప్పుడే చెబుతున్నాను- వాడితో స్నేహం వదిలెయ్యి. లేకపోతే ఊరుకునేది లేదు" అని అరిచాడు తప్పిస్తే, మహేంద్ర సందేహాన్ని మాత్రం తీర్చలేదాయన.

సందేహం తీరని మహేంద్ర ఒక రోజున తన స్నేహితులను అడిగాడు: 'ఆకలి అందరికీ ఉంటుంది గదా, మరి అన్నం ఎందుకు ఉండదు, అందరికీ?' అని. వాళ్లకీ తెలీదు, అట్లా ఎందుకౌతున్నదో! అయితే ఆ మాట విన్నారు- వాళ్ల టీచరుగారు. ఆయన మహేంద్రను పిలిచి, జవాబిచ్చారు: "ఆకలి అందరికీ ఉంటుంది- ఎందుకంటే ఆకలి అన్నది శరీర ధర్మం. మరి అన్నం ఎందుకు

ఉండదు అనేది పెద్ద విషయమే- చూడు, మీ తాత చదువుకున్నాడు- కాబట్టి మీ నాన్నను చదివించాడు. మీ నాన్న కూడా, చదువుకున్నాడు కాబట్టి నిన్ను చదివిస్తున్నాడు, పోషిస్తున్నాడు.."

"కానీ ఆ రాజు వాళ్ల కుటుంబంలో చూడు, ఎవరూ చదువుకోలేదు. చదువు ప్రాధాన్యత తెలీదు- గనక రాజు వాళ్ల నాన్న రాజును చదివించలేదు; రోగం కారణంగా శ్రమ చేసి కుటుంబాన్ని పోషించనూ లేదు. అందుకనే అందరూ చదువుకోవాలి."

"అంతేకాదు- చూడండి పిల్లలూ, పేదవాళ్లమీద జాలి పడి కొంచెం అన్నం పెట్టారనుకోండి, ఆ అన్నం ఒక్క రోజులోనే అయిపోతుంది. అందుకని కేవలం అన్నం పెడితే సరిపోదు- ఆ అన్నం సంపాదించుకునే మార్గం చూపాలి. చదువును మించిన దానం వేరే ఏదీ లేదు అంటారు అందుకే" అని ముగించారు టీచరుగారు.

మహేంద్ర వాళ్ళ నాన్న అతనికి ఖర్చులకు అని నెలకు రెండు వందల రూపాయలు ఇచ్చేవాడు. ఇప్పుడు మహేంద్ర ఆ డబ్బులను పొదుపు చేసి ఎలాగైనా సరే రాజును చదివించాలని నిశ్చయించుకున్నాడు.

ఆ సంవత్సరం రాజు పరీక్ష ఫీజును మహేంద్రే కట్టాడు. రాజు కూడా అందుకు తగినట్లు చాలా శ్రమించాడు. బాగా చదివి, జిల్లాలో మొదటి స్థానం సాధించాడు.



ఇప్పుడు ఊళ్ళోవాళ్ళంతా రాజు తెలివి తేటల్ని ప్రశంసిస్తుంటే, 'వాడు మా మహేంద్ర స్నేహితుడే' అని గర్వంగా చెబుతుంటాడు మహేంద్రవాళ్ల నాన్న!

తమ విద్యార్థి తోటివారికి చేయూతనివ్వటాన్ని, దాని ఫలితాన్ని ప్రత్యక్షంగా చూసిన టీచరుగారు ఈ కథను ప్రతిసంవత్సరమూ ఎంతో మంది పిల్లలకు వినిపిస్తుంటారు.



కుందేలు-తాబేలు

సేకరణ:సి.పవన్, 6 వతరగతి, టింబక్టుబడి, చెన్నేకొత్తపల్లి.

ఒక అడవిలో ఒక కుందేలు, తాబేలు ఉండేవి. ఒక రోజున కుందేలు తాబేలును ఆట పట్టించాలనుకుంది. "తాబేలూ, తాబేలూ! రేపు మా ఇంట్లో విందు. నువ్వు ఖచ్చితంగా రావాలి" అంది.

"ఓ, అంతకంటేనా! తప్పకుండా వస్తాను" అంది తాబేలు. మరుసటి రోజున బయలుదేరి కుందేలు ఇంటికి నడుచుకొంటూ పోయింది. ఇంకా అది ఇంట్లోకి రాకనే ఎదురువచ్చింది కుందేలు. "నువ్వు లేటుగా వచ్చావు తాబేలూ! ఇప్పుడా, వచ్చేది?! నేను నీకోసం వండిన పాయిసం అంతా అయిపోయింది. ఈసారి ఎప్పుడైనా వస్తే తొందరగా రా!" అన్నది. తాబేలు సిగ్గు పడింది. ఖాళీ కడుపుతోనే వెళ్లిపోయింది.

ఆ తర్వాత ఒకరోజున తాబేలు కుందేలుతో "రేపు మా ఇంట్లో విందు. తప్పకుండా రా" అన్నది. కుందేలు సరేనంటూ ఇంటికి

పోయింది.

"నేను ఇదివరకు దీన్ని మోసం చేశాను గదా, ఇప్పుడు ఇది కూడా నన్ను మోసం చేస్తుందేమో. తొందరగా వెళ్ళి కూర్చుంటాను. దాని వంట తీరునూ చూసినట్లుంటుంది" అనుకున్నది.

ప్రొద్దున్నే పరుగులు పెట్టుకుంటూ తాబేలు ఇంటికి రాబోయింది. దారిలో దాని కాళ్లకు బురద అంటుకున్నది. "అయ్యో! నా కాళ్ళకు బురద అంటిందే! ఇంత తెల్ల చొక్కా వేసుకొని విందుకు బయలుదేరితే ఇట్లా అయిందేమి?" అని వెనక్కితిరిగి ఇంటికి పోయి, కాళ్ళు కడుక్కొని మళ్ళీ పరుగు పెట్టింది. అంతలోనే మళ్ళీ బురద అంటుకున్నది. "ఛీ! ఛీ! ఇట్లా బాగాలేదు- విందుకు ఇంకా చాలా సమయం ఉందిగా, మళ్ళీ వెళ్ళి కడుక్కుంటాను" అని మళ్ళీ ఇంటికి పోయింది. ఇట్లాగే చాలా సార్లు అయ్యింది. ఎన్ని సార్లు బయలుదేరినా, ప్రతిసారీ కుందేలుకు బురద అంటుతూనే ఉన్నది. చూస్తూండగానే విందు సమయం దాటిపోయింది. చివరికి కుందేలుకు ఆకలి, నీరసం, వాటిని మించి విసుగు- అనిపించింది. "కానివ్వు- ఈసారి బురద అంటినావెనక్కి తిరిగి రాను- ముందుకే పోతాను" అనుకున్నది. అట్లా తాబేలు ఇంటికి చేరుకొని కాళ్ళు చూసుకున్నది. కాళ్లనిండా బురద! "అయ్యో! ఇట్లాంటి కాళ్లతో విందుకు ఏం పోతాను? అందరూ నన్ను చూసి నవ్వుతారు. నేను వెనక్కి తిరిగి పోవటమే మంచిది" అని ఇంట్లోకి పోకుండానే వెనక్కి తిరిగింది కుందేలు. అంతలో దానికోసమే ఎదురు చూస్తున్న తాబేలు బయటికి వచ్చి, "అయ్యో! ఇంత ఆలస్యమయిందేమి? రా! రా! కాళ్ళు కడుక్కో, పాపం ఎక్కడెక్కడో నడిచి వచ్చినట్లున్నావు" అని కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళు ఇచ్చింది. కుందేలును ఇంటిలోకి తీసుకుపోయి పోయి చక్కని విందు చేసింది.

తన మనస్తత్వాన్నీ, తాబేలు మంచితనాన్నీ తలచుకొని సిగ్గు పడింది కుందేలు. అటుపైన అది నిజంగానే తాబేలుకు మంచి నేస్తమైంది.



పోలీసు-దొంగ

పదోతరగతి వరకూ చదివి, ఏ పనీ చేతకాని పిల్లలు చాలా మంది కనబడతారు పల్లెల్లో. వీళ్లలో కొందరు పోలీసులుగాను, సైనికులుగాను ఎదిగితే, మరి కొందరు సమాజ వ్యతిరేక శక్తులయి జారిపోతుంటారు. ఈ నేపథ్యాన్ని దగ్గరగా చూస్తున్న సంధ్య అల్లింది ఈ పిచ్చి జానపద కథని. స్పష్టంగా లేదు గానీ, దీని వెనక ఏదో ఉన్నదనిపిస్తుంది చదివితే..

రచన: జి.సంధ్య, 7 వతరగతి, టింబక్టుబడి.

అనగనగా ఒక ఊరు ఉండేది. ఆ ఊరి పేరు ముష్టికోవెల. ఆ ఊరిలో రాజు-సుధ అని ఇద్దరు దంపతులుంటారు. వాళ్ళు చాలా మంచివాళ్ళు. వాళ్ళ ఇల్లు చాలా చిన్నది. ఒకరోజు గాలి చాలా విపరీతంగా వీస్తుంది. ఆ గాలి వానకు వాళ్ళ ఇల్లు కాస్తా పడిపోతుంది.

ఇంక అక్కడ ఉండటం ఇష్టంలేక, వాళ్ళు ఆ రాత్రికి రాత్రే ప్రయాణమై, సామాన్లన్నీ సర్దుకొని వేరే ఊరు దారమ్మట పోతా ఉంటారు.

అలా వాళ్ళు పోతూ ఉంటే పక్కనే ఒక చెరువు, చెరువుకట్ట ఉంటుంది. దాని మీద ఒక గుడిసె కూడా ఉంటుంది. ఆ గుడిసెను చూసి వాళ్ళు చాలా సంతోషపడతారు. రాజు-సుధ ఇద్దరూ అక్కడికి పోతారు.



ఆ గుడిసెలో ఒక ముసలమ్మ ఉంటుంది. వీళ్ళిద్దరూ ఆమె దగ్గరకు వెళ్ళి "అవ్వా! మేము కూడా ఇక్కడ ఉండచ్చా?" అని అడుగుతారు. అవ్వ 'సరే' అని ఒప్పుకొనింది. మెల్లగా తన గురించిన అన్ని విషయాలనూ చెప్పటం మొదలు పెట్టింది అవ్వ: "నాకు తోటలు ఉన్నాయి. అలాగే నాకు ఒక మనవడు కూడా ఉన్నాడు. మరి వాడు పెద్ద చదువు చదివి పోలీస్ అవుతాడని, నేను వాడికి పోలీస్ బట్టలు కూడా తెచ్చినాను. కానీ వాడు ఒక రోజు 'నేను పోలీసుల్లో జేరతా' అని చెప్పి ఊరి బయటకు పోయినాడు. కానీ ఆ రోజు నుండి ఈ రోజు వరకు ఇంటికి తిరిగి రాలేదు. ఎందుకంటే వాడు చేరింది పోలీసుల్లో కాదు- దొంగల జతలో జేరిపోయినాడు" అని అవ్వ చెప్పింది.

సుధ చాలా ధైర్యవంతురాలు. బాగా తెలివైనది కూడా. ఆమె అడిగింది- "ఓ అవ్వా! ప్రక్కనే ఊరు ఉంది కదా! అక్కడికి ఎవ్వరేకాని దొంగలు రారా? వాళ్లలో ఉంటాడేమో, నీ మనవడు- పోయి చూసుకొని వెనక్కి తెచ్చుకోరాదా? అట్లా దొంగల్లో ఎందుకు వదిలేస్తావు, ఊరికే?" అన్నది.

అప్పుడు ఆ అవ్వ "ఎందుకు రారు తల్లీ, రోజూ వస్తారు. అందరి ఇళ్లలోనూ దొంగతనం చేస్తూ పోతారు. చిక్కిదంటే ఏదో ఒకటి తీసుకొనిపోతారు. వాళ్లలోనే ఉన్నాడు నా మనవడు కూడా. నేను ఒకసారి పోయి వాడిని ఇంటికి తిరిగి రమ్మని బ్రతిమిలాడాను- కానీ ఆ

దొంగల సావాసం పట్టినవాడు వెనక్కి ఎందుకు వస్తాడు? నా మాట వినసే లేదు" అన్నది ఏడుస్తూ.

"ఏడవకవ్వా! ఈసారి వాళ్ళెవరైనా నీకు ఎదురైతే 'నా ఇంట్లో ఉండేకి పోలీసు వచ్చాడు' అని చెప్పు. నీమనవడు ఇంటికి వచ్చేంతవరకు నేను పోలీసు వేషం వేసుకొనే ఉంటాను" అన్నది సుధ, అవ్వ దగ్గరినుండి పోలీసు బట్టలు తీసుకుంటూ.



ఆరోజు సాయంత్రం సుధ పోలీసు వేషంలో అడవికి దగ్గర్లో తిరుగుతుంటే, దొంగలు ప్రక్క ఊళ్ళో దొంగతనం చేసిన గొర్రెలతో ఊరికి తిరిగి వస్తూ కనబడ్డారు.

ఆమె ధైర్యంగా వాళ్లకి ఎదురుగా నిలబడి, బొంగురు గొంతుతో "రే! ఎక్కడికి రా, పోతూ ఉన్నారు? అవి ఇక్కడ ఇవ్వండి!" అని వాళ్లని బెదరగొట్టింది. అట్లా వాళ్ల దగ్గర గొర్రెలు ఇప్పించుకొని వాళ్లని ఊరి బయటి వరకు తరిమింది. అటుపైన ఆ గొర్రెల్ని అవ్వకిచ్చి "ఇవిగో, మీ మనవడి గొర్రెలు- బాగా పెంచి పెద్ద చెయ్యి" అని చెప్పింది.

దొంగలు "ఎవర్రా, ఈ పోలీసు ఎవరో మన ప్రాణానికి ఇలా చుట్టుకున్నది? మనం శ్రమపడి దొంగిలించిన గొర్రెల్ని కూడా కొట్టేసింది? ఈమె పని చెప్పాలి. ఈ రోజు రాత్రికే ఈమెని తుదముట్టించుదాం" అనుకున్నారు.

అయితే ఆ సంగతి ముందుగానే ఊహించిన సుధ అవ్వనడిగి కారంపొడి, కత్తి తీసుకొని ప్రక్కనే పెట్టుకొని ఉంటుంది. రాజుతో తడకలు అల్లించుకొని ఇంటి చుట్టూ కట్టేసి, ఒక్క చోటమాత్రం రంధ్రం విడిచి పెట్టి ఉంటుంది. ఆరోజు రాత్రి ఆమెను చంపేసేందుకని వస్తారు దొంగలు- గుడిసె చుట్టూ ఎంత తిరిగినా లోపలికి పోయేందుకని తలుపు కనిపించదు- ఒక్క చోట మాత్రం రంధ్రం కనబడుతుంది.

'గుడిసెలో ఎక్కడా లేని బొక్క ఇక్కడ ఎందుకురా, ఉంది?' అని మొదటి దొంగ బొక్కలోంచి తల లోపలికి పెట్టి చూస్తాడు. అందుకోసమే సిద్ధంగా ఉన్న సుధ వాడి ముక్కు పట్టుకొని కోసేసి కారం పొడి వేస్తుంది. వాడు గట్టిగా 'అమ్మో,అమ్మో' అని మొత్తుకుంటే, మిగిలినవాళ్లంతా 'ఏమిటిరా, ఏమైంది' అని అరుస్తారు. 'నువ్వు చూడు- నువ్వు చూడు' అంటాడు తప్పిస్తే, వాడు ఎవ్వరికీ ఏమీ చెప్పడు. అలా ఒక్కొక్కళ్ళూ తల లోపలికి పెట్టటం, సుధ వాళ్ల ముక్కు కోసేసి కారంపొడి వెయ్యటం- చివరికి అందరూ ముక్కులు పట్టుకొని అరుచుకుంటూ పారిపోతారు.

దాంతో దొంగలకు చాలా కోపం వస్తుంది. వాళ్లలో కొత్తగా చేరిన అవ్వ కొడుకు మాత్రం 'నేనింక మీతో ఉండను- వెనక్కి వెళ్ళిపోతాను' అంటాడు. దొంగలందరూ వాడితో మంచిగా మాట్లాడి 'ఈ ఒక్క సారికీ ఆగు. మనందరం కలిసి ఒక్క పోలీసు పని పట్టలేమా? రేపు రాత్రి ఆ పోలీసు నిద్రపోతుండగానే ఎత్తుకుపోదాం' అనిచెప్పి వాడిని ఒప్పిస్తారు.

అయితే సుధకు వాళ్ళు మళ్ళీ ఎలాగూ వస్తారని తెలుసు. అందుకని ఆమె ఆ రోజు రాత్రి తెల్లచీర కట్టుకొని జుట్టు విరబోసుకొని మంచం మీద హాయిగా నిద్రపోతుంది. దొంగలు మెల్లగా లోపలికి వచ్చి చూస్తారు. చీకట్లో వాళ్లకి ఏమీ కనిపించదు; కానీ మంచం మీద ఎవరో ఉన్నారు అని మాత్రం తెలుస్తుంది. వెంటనే వాళ్ళు ఆ మంచాన్ని నాలుగువైపులా పట్టుకొని బయలుదేరతారు- ఊరి బయట చెరువులోకి ఎత్తి పడేద్దామని. వాళ్ళు అట్లా మంచాన్ని ఎత్తుకొని పోతూ ఉంటే, ఆ కుదుపులకు సుధకు మెలకువ వస్తుంది.

'ఓహో ఇట్లా ఉందా, వీళ్ల పని?' అని ఆమె వాళ్ళు నలుగురి జుట్టూ తీసుకొని, మంచానికి చక్కగా ముడివేసి పెడుతుంది. వాళ్ళు నడుస్తూంటే జుట్టు కదిలినప్పుడల్లా నొప్పి పుడుతుంటుంది. వాళ్ళు అనుకుంటూ ఉంటారు 'ఏమోరా, ఈ పోలీసు- ఇంత బరువు! ఇది పోలీసా దయ్యమా?' అనుకుంటూ అతి కష్టంగా ఎత్తుకుపోతారు.

దారిలో వాళ్ళు ఒక మర్రి చెట్టు క్రిందినుండి పోతూ ఉన్నప్పుడు, పైనుండి అందిన ఊడల్ని పట్టుకొని సుధ చెట్టెక్కి పోయి మర్రిచెట్టు మీద కూర్చొని ఉంటుంది. వాళ్ల జుట్లు ముడివేసి ఉండటం వల్ల మంచం బరువు తగ్గినా గుర్తించలేరు వాళ్ళు. అట్లా ఇంకొంచెం ముందుకి పోయి, ఎలాగో ఒకలాగ చెరువులోకి పడేస్తారు మంచాన్ని. ఆ మంచంతో పాటు వాళ్ళూ పడతారు చెరువులో! అట్లా ఎందుకయ్యిందో కూడా వాళ్లకు అర్థం కాదు. 'అయ్యో ఎంత పొరపాటురా' అని అరుచుకుంటూ మంచం నుండి విడిపించుకొని, నీళ్ళలో ఈదుకుంటూ బయటికి వచ్చి మర్రిచెట్టు క్రింద కూర్చుంటారు.

అంతలోనే సుధ పెద్దగా అరుచుకుంటూ చెట్టు పై నుంచి దూకుతుంది వాళ్ల మధ్య! వాళ్ళు 'బాబోయ్! దయ్యం వచ్చిందిరా!' అని దిక్కుకు ఒకరు పారిపోతారు.

సుధ నవ్వుకుంటూ ఇంటికి పోయే సరికి అవ్వ మనవడు తడిసి ముద్దయి ఇల్లు చేరుకొని ఉంటాడు ముక్కుకి పట్టీ వేసుకొని. అవ్వ, సుధ, రాజు అందరూ వాడికి మంచి బుద్ధులు చెప్పి, సరైన దారిలో నడిపిస్తారు.

హోటల్ బేరం!

జోకు

హోటల్లో పనిచేసే వెంగళప్ప కోర్టుకు వెళ్ళాడొక సారి-

జడ్జి: ఆర్డర్, ఆర్డర్......

వెంగళప్ప: దోసె, వడ, ఇడ్లీ, ఉప్మా, పూరీ....

జడ్జి: షటప్.

వెంగళప్ప: అది లేదు సార్! సెవెన్ అప్ మాత్రం ఉంది- తెమ్మంటే తెస్తాను.

సేకరణ: సుచరిత



పొట్టి మునక్కాయ

సరిగ్గా ఇలాంటి జానపదాలే- వంకాయ కథ, కోడి వగైరాల కథ- కొత్తపల్లిలో ప్రచురితమయ్యాయి గతంలో. అయినా కథనంలో కొత్తదనాన్నీ, రాధిక ఉత్సాహాన్నీ చూస్తే మళ్ళీ వేయవచ్చనిపించింది. వీటి వెనకాల ఏమేం అర్థాలు ఉన్నాయనో, మరి ఈ కథలు ఇన్నేళ్ళుగా ఒక తరం నుండి ఒక తరానికి పాకి పిల్లల్లో నవ్వులు కురిపిస్తున్నాయి?

సేకరణ: సి.రాధిక, 9 వతరగతి,వెంకటంపల్లి,చెన్నేకొత్తపల్లి మండలం, అనంతపురం జిల్లా.

అనగా అనగా ఒక ఊళ్లో ఒక అవ్వ, తాత ఉండేవాళ్ళు. వాళ్ళకి పిల్లలు లేరు. ఒక మునక్కాయ తోట మాత్రం ఉండేది.

రోజూ అవ్వ తోటలోని మునక్కాయలు కోసుకునేది. ఒక రోజున అవ్వ ఒక మునక్కాయను కోయబోతుంటే "అవ్వా! అవ్వా! నన్ను కోయబాకవ్వా!" అని వినిపించింది.

అవ్వ అటూ-ఇటూ చూసింది.

"అవ్వా! అటూ-ఇటూ చూడబాకవ్వా!

నువ్వు కోసే మునక్కాయనవ్వా!" అంది ఆ గొంతు.

అయినా అవ్వ ఆ మునక్కాయను కోసుకుని ఇంట్లో పెట్టుకుంది.

"మునక్కాయా!మునక్కాయా! నువ్వు ఇక్కడే ఉండు. నేను పోయి తాతకు అన్నం ఇచ్చేసి వస్తాను" అంది.

అవ్వ తాతకు అన్నం ఇచ్చేసి వచ్చింది. మునక్కాయ అంత సేపూ ఇంటికి కాపలా కాసింది.

ఇట్లా ఉంటే ఒక రోజు అవ్వకు ఒంట్లో బాగాలేదు. "మునక్కాయా, మునక్కాయా! నువ్వు పోయి తాతకు అన్నం ఇచ్చి రావా!" అంది అవ్వ.

"సరే" అని మునక్కాయ తాతకు అన్నం ఇచ్చేసి రాను పోయింది.

పోయి తాత దగ్గరున్న మడక తీసుకొని సాయంత్రం దాకా దున్నుతూ ఉంది.

చీకటి పడింది- మునక్కాయ ఇంక ఇంటికి పోదామనుకుంటున్నది. ఇంతలో దొంగలు వచ్చి ఎద్దులను కాస్తా తోలుకొని వెళ్ళారు.

మునక్కాయ తాత దగ్గరకు పోయి "తాతా! తాతా! ఎద్దులను దొంగలు తోలుకుని వెళ్ళారు. అయినా మీరేమీ బాధ పడకండి. నేను పోయి వెనక్కి తోలుకుని వస్తాను" అంది. అలాగే అవ్వ దగ్గరకు వెళ్ళి "దార్లో తినేకి నాకు మురుకులు నాలుగు కాల్చి ఇవ్వు" అని అడిగింది. అట్లాగే అవ్వ నాలుగు మురుకులు కాల్చి ఇచ్చింది.

మురుకులు తీసుకొని పోతూవుంటే దారిలో మునక్కాయకు ఒక ఎండ్రకాయ కనిపించింది. "మునక్కాయా! మునక్కాయా! నాకు కొంచెం మురుకులు పెట్టవా!" అంది. "నాకు సహాయం చేస్తే ఇస్తాను" అంది మునక్కాయ. రెండూ కలసి బయలుదేరాయి.

కొంత దూరం వెళ్ళాక వాటికొక తేలు కనిపించింది. "మునక్కాయా! మునక్కాయా! నాకు కొంచెం మురుకులు పెడతావా!" అంది తేలు.

"అయితే నాతో కూడారా" అంది మునక్కాయ.

తరువాత ఒక చీమ ఎదురైంది. అదికూడా మునక్కాయను అలాగే అడిగింది.

అన్నీ కలసి దొంగల ఇంట్లో చేరాయి. అప్పుడు పోయి ఎండ్రకాయ గుమ్మంలోను, చీమ లైటు స్విచ్చి దగ్గర, తేలు వంట ఇంటిలో దాక్కున్నాయి. అంతలో దొంగలు ఇంట్లోకి రాబోయారు.

గుమ్మం దగ్గర కూర్చున్న ఎండ్రకాయ మొదటి దొంగను కరిచింది.

స్విచ్చి దగ్గర కూర్చున్న చీమ రెండవ దొంగను కుట్టింది.

వంట ఇంట్లో దాక్కున్న తేలు వచ్చి మూడవ దొంగను కుట్టింది.

మునక్కాయ వచ్చి అందరి తలల మీదా తలా ఒక దెబ్బ వేసింది. దాంతో దొంగలంతా భయపడి ఎద్దుల్ని అక్కడే వదిలేసి పారి పోయారు.

మునక్కాయ మురుకులను ముగ్గురికీ పంచింది. సహాయం చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపింది.

నలుగురూ కలసి ఎద్దులను ఇంటికి తోలుకొని పొయ్యారు.

అవ్వ, తాత మునక్కాయను మెచ్చుకొని కొడుకులా చూసుకున్నారు.

ఘనకార్యం! **జోకు**

కొడుకు: నాన్నా! నాకు నూటికి నూరు మార్కులొస్తే ఏం చేస్తావు?

తండ్రి: అబ్బో! మూర్ఛపోతాను.

కొడుకు: అందుకే నాన్నా! నేను ముప్పై తెచ్చుకున్నాను!!

సేకరణ: సుచరిత



సాలెగూడు-తేనెటీగ

రచన: పి.ఎస్.నాగరాజు, సంపాదకుడు, ప్రజాసాహితి.

"నా దెంత నైపుణ్యం! ఎంత ఆకర్షణీయంగా ఈ గూడు కట్టాను! నన్నెవరూ మెచ్చుకోరేం?" నొచ్చుకుంది సాలీడు, చెట్టుకి సాలెగూడు కట్టి.

పక్కగా ఎగిరే పిచుక- "ఈ సాలీడు ఎంత పన్నాగం పన్నిందో! ఆకలిని తీర్చుకోడానికి కుట్రలెందుకో! నాలా కష్టపడి నేరుగా వేటాడవచ్చుగా! "అంటూ కనిపించిన పురుగును చటుక్కున నోట కరచుకొని గూడు కేసి తుర్రుమంది.

ఈలోగా ఓ తేనెటీగ అటువైపు వచ్చింది. "ఇవాళ ఎలాగైనా నేనే ఎక్కువ తేనె సేకరించాలి!" అనుకుంటూ, అందర్నీ వదిలి ఒంటరిగా వస్తూ, ఏమరపాటుగా సాలెగూడులో చిక్కుకుపోయింది.

గూడులో అలికిడి కాగానే మధ్యలో వున్న

సాలీడు అటుగా గబగబా పాకి వచ్చింది. తన వైపు వచ్చే సాలీడుతో "దయచేసి నన్ను తినకు. నీకు పుణ్యం వుంటుంది" అంది తేనెటీగ, జాలిగా.

"పిచ్చిదానా! నా గూట్లో చిక్కాక బయటపడ్డం అసాధ్యం" అంది సాలీడు సంతోషపడుతూ.

"అలా కాదు! ఈ చెట్టు కొమ్మకే మేం పెట్టిన పెద్ద తేనె పట్టువుంది, నీకు కావలసినంత తేనె ఇస్తా, నన్నొదిలెయ్" అంది దీనంగా తేనెటీగ.

"నాకు తేనె సయించదు, నాకు నువ్వే ఎంతో రుచి!" అంటూ గూడులో గిలగిల లాడుతున్న తేనెటీగని నోట్లో వేసుకోవాలని నాలుగడుగులు ముందుకి వేసింది సాలీడు.

సరిగ్గా అప్పుడే తేనెటీగలు మూకలావచ్చాయి తప్పిపోయిన తేనెటీగని వెతుక్కుంటూ. ఆ మూక బరువుగా వేగంగా దూసుకొచ్చేసరికి - సాలెగూడు చెదిరిపోయింది. బతుకు జీవుడా అని సాలీడు ఓ సాలెదారం పోగు వెంట నేలకు జారింది.

చావు నుంచి బయటపడిన తేనెటీగ తోటినేస్తాలకి మప్పితాలు చెప్పింది.

జోకులు

సంక్రాంతి కాలం!

భర్త: ఇంత రాత్రి మేడపైన కూర్చుని ఆకాశంలో చుక్కలు చూస్తూ ఏం ఆలోచిస్తున్నావు?

భార్య: ఆకాశంలోని చుక్కలన్నింటినీ కలిపితే ఎంత ముగ్గవుతుందా అని!

తప్పయిందే!

అమ్మ: పండూ! డబ్బాలో నాలుగు మిఠాయిలుండాలి, ఒకటే ఉందే?

పండు: అరెరే! ఇంకోటి ఉందా, నేను మూడే తిన్నానే మరి?!

సేకరణ: సుచరిత



సాయం

శ్రీమతి వి.నాగలక్ష్మి, ఉపాధ్యాయురాలు, కె.ఎస్.ఆర్. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, అనంతపురం.


అనగనగా సంగాపురం అనే ఊళ్ళో రామయ్య, సీతాలు అనే దంపతులు ఉండేవాళ్ళు. వాళ్ళకు ఒక కొడుకు. వాడి పేరు గిరి. వాళ్ళది చాలా బీద కుటుంబం. భార్యా భర్తలు ఇద్దరూ కష్టపడి పని చేసేవాళ్ళు. ఏ పూటకాపూట భోజనం సమకూర్చు-కునేవాళ్ళు. కూలి పనికి పోయినప్పుడు పిల్లవాడిని కూడా వెంటబెట్టుకు పోయే వాళ్ళు.

గిరి చాలా చురుకైన పిల్లవాడు. ఊళ్లో పిల్లలందరూ బడికి పోవడం చూసాడు వాడు. "నన్ను కూడా బడికి పంపండి నాన్నా!"అని వేధించటం మొదలుపెట్టాడు. "తినడానికి తిండే లేదురా, ఇంక నిన్ను బడికి ఎక్కడ పంపేది?!"అన్నాడు రామయ్య. అయితే సీతాలు కూడా బడివైపే మొగ్గు

చూపింది: "గిరిని బడికి పంపుదాం! ప్రభుత్వ బడిలో ఫీజులు కట్టవలసిన పనిలేదు- పైపెచ్చు మధ్యాహ్నం భోజనం కూడా పెడతారు- పంపుదామయ్యా!"అన్నది. 'సరేలే, పంపుదాం' అని తను కొంచెం తగ్గి, గిరిని బడిలో చేర్పించాడు రామయ్య.

బడిలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను ఏకాగ్రతతో విని, ఎప్పటికప్పుడు నేర్చేసుకునేవాడు గిరి. పెద్దవుతున్నకొద్దీ అతనిలో మంచి లక్షణాలు కూడా పెరిగాయి: చాలా మంచి పిల్లవాడు అని పేరు తెచ్చుకున్నాడు. అమ్మ-నాన్నలు, టీచర్లు, పెద్దలు చెప్పిన మాట వినేవాడు. అణకువ, వినయ-విధేయతలు ఉన్నై- ఆలోచించి, ధైర్యంగా ప్రశ్నించే శక్తి ఉన్నది. పాఠశాలకు క్రమం తప్పకుండా పోతాడు, అబద్ధాలు చెప్పడు- ఏరోజు పాఠాలు ఆరోజు చదువుకుంటాడు. క్లాసులో ఎప్పుడూ కూడా అందరి కంటే మొదటివాడుగా ఉండేవాడు. చూస్తూండగానే వాడు ఐదవతరగతి పూర్తి చేశాడు. ఆరవతరగతి హైస్కూల్లో చేరాలి..

కానీ రామయ్య "ఇక చాలు" అన్నాడు. "నా ఆరోగ్యం బాగా లేదు గిరీ! నువ్వు చదువు మానేసి, ఏదైనా కూలిపనికి పోవలసిందే" అన్నాడు. గిరికి మాత్రం చదువుకోవాలన్న కోరిక బలంగా ఉంది- వాళ్ల బడిలో టీచర్లందరూ వచ్చి చెప్పినమీదట, రామయ్య అయిష్టంగానే ఒప్పుకున్నాడు. బడికి పోయే లోపల గిరి వార్తాపత్రికల్ని ఇళ్లకు చేరవేసేవాడు, పాల ప్యాకెట్లు వేసేవాడు. అలా సంపాదించిన డబ్బులతో పరీక్ష ఫీజులు కట్టుకునేవాడు.



అన్ని క్లాసుల్లోను మొదటి ర్యాంకు సాధిస్తూనే వచ్చాడు- పదవతరగతిలో జిల్లా ఫస్టుగా నిలిచాడు! రామయ్య, సీతాలు

సంతోషించారు. కానీ వాళ్ల ఆర్థిక పరిస్థితి ఇంకా అలాగే ఉంది- గిరిని పై చదువులు చదివించటం ఎలాగ? చివరికి వాడు దగ్గర్లోనే ఉన్న ప్రభుత్వ కళాశాలలో చేరాడు. పాల ప్యాకెట్లు, దిన పత్రికలు ఇంటింటికీ చేరవేసే పనిని కొనసాగించాడు. అలాగే ఎవరైనా ఏదైనా పని చెప్పినా కూడా చేసేవాడు.

పరీక్షల సమయం దగ్గర పడింది. యంసెట్ పరీక్ష ఫీజు కట్టాలి. సరిగ్గా అదే సమయంలో గిరికి ఆరోగ్యం బాగాలేక, ఇబ్బంది ఏర్పడింది. దానికి తోడు పరీక్ష ఫీజు కట్టడానికి డబ్బు చిక్కలేదు. తను రోజూ పేపరు, పాలు ఇచ్చే ఇళ్ళలో ఎక్కడైనా అప్పు అడుగుదామనుకున్నాడు. కానీ ఎవరేమంటారో అని సందేహం! చివరి తేదీ దగ్గర పడుతున్న కొద్దీ అతనికి అదొక పెద్ద సమస్యగా మారింది.


వరాలయ్యగారి ఇంట్లో రోజూ పేపరు వేస్తుంటాడు తను. వాళ్ళు తనని ఆదరంగా పలకరిస్తుంటారు. అందులోనూ ఆయన భార్య కమలమ్మ గారి మనస్సు మంచిది. తరచూ తనకు ఏదైనా ఫలహారం పెట్టి కన్నతల్లిలా పలకరిస్తుంది. కానీ వరాలయ్యని చూస్తేనే గిరికి భయం- ఎప్పుడూ రుసరుసలాడుతుంటాడు. వాళ్ళని అడిగితే..?

గిరికి ఏమి చేయాలో తోచలేదు- మరునాడే ఫీజు చెల్లించేందుకు ఆఖరు తేదీ. ఇక తప్పదన్నట్లు ధైర్యం చేసాడు. వసారాలో నిలబడి పేపరు అందుకున్న వరాలయ్యను అప్పు అడిగాడు- ఎలాగో ఒకలా ఆ అప్పు చెల్లించుకుంటానని ప్రాధేయపడ్డాడు. "నా దగ్గర ఒక్క పైసా కూడా లేదు" అని మొండిగా మాట్లాడాడు వరాలయ్య. "ఈ పిల్లలందరూ ఇంతే- డబ్బులు తీసుకుంటారు; తర్వాత అప్పు ఎగగొట్టి మాయమైపోతారు" అని తిట్టుకుంటూ లోపలికి వెళ్ళిపోయాడు.

గిరి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. 'వాళ్ళుఅయితే కాదనరు' అనుకున్నాడు వాడు- వాళ్ళే ఇంత చిన్నబుచ్చుతారని అనుకోలేదు. అయితే భర్త ఎవరినో కేకలు వేస్తుండటం విని, కమలమ్మ

బయటికి వచ్చి చూసింది. కళ్ళ నిండా నీళ్ళు పెట్టుకొని గిరి నిలబడి ఉన్నాడు. సంగతి అర్థంకాగానే ఆమెకు జాలి వేసింది. 'ఇప్పుడే ఇచ్చేస్తాను- ఉండు నాయనా!' అని లోపలికి వెళ్ళి పరీక్ష ఫీజు తెచ్చి ఇచ్చింది. "ఇదివరకు వరాలయ్యగారి సహాయం పొందిన వాళ్ళంతా ఆ అప్పు చెల్లించటం సంగతి అటుంచి, మళ్ళీ మొహం కూడా చూపించలేదు బాబూ! ఆయన గట్టిగా మాట్లాడారని నువ్వేమీ అనుకోకు- ఈ డబ్బు తీసుకో- నీకు వీలైతే, ఎప్పటికైనా తిరిగి ఇవ్వు- ఈ డబ్బుని మాత్రం మంచిపనికే వాడు నాయనా- అంతే, మేం కోరుకునేది" అన్నది.

గిరి సిగ్గుపడుతూనే ఆమెకు మరోసారి సంజాయిషీ ఇచ్చుకున్నాడు. డబ్బులు తీసుకొని, ఆమెకు నమస్కరించి వెళ్ళిపోయాడు. ఆవిడ అన్న ఆ కాసిని మాటలు గిరి మనసులో నాటుకు పోయాయి. తను మాత్రం వీళ్ళ ఋణం ఉంచుకోడు- ఎలాగైనా సరే వీళ్ళ అప్పు తీర్చేస్తాడు' అనుకున్నాడు. బాగా చదువుకొని మంచి మార్కులు తెచ్చుకున్నాడు. మెడిసిన్‌లో సీటు సంపాదించాడు. సొంత ప్రతిభతో స్కాలర్షిప్పు కూడా తెచ్చుకున్నాడు. మంచి డాక్టరయ్యాడు; ఇంటి పరిస్థితిని చక్కదిద్దాడు. వాళ్ళ నాన్న ఆరోగ్యం బాగు చేశాడు. వాళ్ళ ఊళ్ళోనే ఆసుపత్రి నిర్మించి బీద ప్రజలకు ఉచితంగా వైద్యం చెయ్యాలనుకున్నాడు.



ఊళ్ళోకి రాగానే ముందుగా వరాలయ్యగారి ఇంటికి వెళ్ళాడు. "అమ్మా! ఇదిగోండి- మీరు నాకిచ్చిన డబ్బులు, వడ్డీతో సహా మీకు తిరిగి ఇవ్వాలని వచ్చాను. ఆనాడు మీరు నన్ను నమ్మి, నాకు డబ్బు సాయం చేయకపోతే నేను ఏం చేసేవాడినో, తెలీదు. నా జీవితాన్ని

నిలబెట్టింది మీరే. మీకు ఏమిచ్చినా నా ఋణం తీరదు" అన్నాడు. గిరిని చూసి కమలమ్మ చాలా సంతోష పడింది- "ఈ డబ్బులు మాకు ఇవ్వనక్కర్లేదు బాబూ! నీ దగ్గరే ఉండనీ. నువ్వే వీటిని సద్వినియోగం చెయ్యి. మంచితనమూ, తెలివి తేటలూ ఉండి కూడా ఎంతమంది పిల్లలు తమ పేదరికం కారణంగా చదువులు మానేస్తున్నారో, తెలీదు. అలాంటివాళ్ళకు కనీసం ఒక్కరికైనా ఈ డబ్బు ఉపయోగపడిందని మాకు చాలా సంతృప్తిగా ఉన్నది. ఈ డబ్బుతో ఇప్పుడు ఇంకొకరికి ఎవరికైనా సాయం చెయ్యి. మేం తరించినట్లవుతుంది" అన్నది.

ఆవిడ ఇచ్చిన స్ఫూర్తితో గిరి ఊళ్ళో ఆసుపత్రి నిర్మించటమే కాక, పేద పిల్లలకు ఉపయోగపడేలా ఎన్నో మంచి పనులు చేపట్టాడు.

ఒకటే మార్గం! **జోకులు**

హరిని: ఏమండీ! ఇక్కడ సుబ్బారావు గారి హాస్పిటల్‌కు ఎలా వెళ్లాలండీ?

గిరి (కోపంగా): ఏదో ఒక రోగంతోనండీ.

అబద్ధం!

లాయర్: యువరానర్! ఈ ముద్దాయి హత్య చేస్తున్నప్పుడు మొత్తం కాలనీ కాలనీ అంతా చూసింది.

ముద్దాయి: ఈ లాయరప్ప అంతా అబద్ధమే చెబుతున్నాడు సార్! నేను ఎవరూ చూడకుండా అన్ని ఏర్పాట్లూ చేసుకున్నాను!

సేకరణ: సుచరిత



దేవునికి టోపీ

రచన: శ్రీమతి ఆదూరి హైమవతి, విశ్రాంత ప్రధానోపాధ్యాయిని, బెంగుళూరు.

వనపర్తి అనే గ్రామంలో వరదయ్య అనే ధనవంతుడు ఒకడు ఉండేవాడు. అతని దగ్గర చాలా డబ్బు ఉండేది; కానీ అతను మాత్రం పరమ పిసినారి- పిల్లికి కూడా బిచ్చం పెట్టేవాడుకాదు. అతని పిసినారితనాన్ని గురించి ఊళ్ళోవాళ్ళు కథలు కథలుగా చెప్పుకుంటూ ఉండేవాళ్ళు.

ఓమారు ఆ గ్రామానికి మహిమ గల ఋషి ఒకాయన వచ్చాడు. హిమాలయాలనుండి తను తీసుకు వచ్చిన శివలింగాన్ని ఊరి శివాలయంలో ప్రతిష్ఠించాడు. నిత్యం పంచామృతాలతో అభిషేకం చేయసాగాడు. ఊళ్ళో జనాలందరూ తమ వంతుగా పాలు, పెరుగు, నెయ్యివంటివి తీసుకెళ్ళి అభిషేకంలో పాల్గొంటున్నారు.

శివాలయానికి వెళ్ళే దారి వరదయ్య ఇంటి

ముందునుండే పోతుంది. అందరూ తన ఇంటి ముందునుండే వెళ్తున్నారు; తనని చూసి హేళనగా నవ్వుతున్నారు- వరదయ్యకు ఇది కంటగింపుగా ఉంది. అంతలో ఓ తుంటరి నలుగురికీ వినబడేట్లు గట్టిగా "ఎంతమంది వచ్చినా వరదయ్యగారు మాత్రం ఆలయానికి రారు లేవోయ్! పాపం ఆ పాలు,పెరుగు అమ్ము కుంటే నాల్గు డబ్బులు వెనకేసుకోవచ్చు- శివలింగానికి అభిషేకం చేస్తే ఏం వస్తుంది చెప్పు?" అనటం, వాడి చుట్టూ చేరిన గుంపు మొత్తం వికవికమని నవ్వటం చూసి వరదయ్యకు రోషం వచ్చింది. 'తనుకూడా భక్తుడే' అని నిరూపించు-కోవాలనుకున్నాడు.

'ఐనా సేరు పాలని చూస్తూ చూస్తూ ఆ రాతి మీద పోయటం ఎలా?' అని వరదయ్యకు రాత్రంతా నిద్రపట్టలేదు. చివరికి ఒక ఉపాయం తట్టింది. ఇంట్లో చాలా కాలంగా మురిగిపోయిన పాత బియ్యపు పిండి ఎలాగూ ఉంది. దాన్నిండా పురుగులూ, చెత్తా చెదారమూనూ! ఇప్పుడు వరదయ్య కూర్చొని దాన్ని శుభ్రం చేశాడు. పలచటి బట్టలో వేసి వస్త్రకాయం పట్టాడు. కొంచెం పిండిని చాలా నీళ్లలో ముద్దలు లేకుండా కలిపి, కొద్దిగా కర్పూరం జత చేసాడు. ఇప్పుడు చూస్తే ఆ మిశ్రమం పాల లాగానే కనబడుతున్నది! ఇంకేమి? వరదయ్య ఆ పిండిపాలను ఓ చెంబులో పోసుకున్నాడు. విభూది పట్టీలు పెట్టుకున్నాడు. పాతకాలపు గావంచా కట్టుకున్నాడు. తను శివాభిషేకానికి వెళుతున్నట్లు అందరికీ తెలిసేందుకుగాను దారిన పోయే వాళ్ళనందరినీ పలకరిస్తూ శివాలయానికి బయల్దేరాడు. అట్లా అపర శివుడిలాగా తను గుడికి నడుస్తూ ఉంటే, ఊళ్ళో జనాలంతా గుడ్లు వెళ్ళ బెట్టుకుని చూడటం అతనికెంతో ఆనందాన్నిచ్చింది.

అట్లా వరదయ్య పిండిపాలతో శివునికి అభిషేకం చేసాడు. తన తరువాతి భక్తులు ఎవరో అభిషేకం చేయగా వచ్చిన పాలను ప్రసాదంగా తెచ్చుకున్నాడు, అదే చెంబునిండా! ఆ పాలను కాచి, తోడుపెట్టి, ఆ పెరుగును చిలికి, వచ్చిన ఆ వెన్న కాచి,

నెయ్యిని చక్కగా సీసాలో భద్రపరచుకున్నాడు. ఇట్లా ప్రతిరోజూ పిండి పాలతో శివుడికి అభిషేకం చెయ్యటం, మంచి పాలను ప్రసాదంగా తెచ్చుకొని నెయ్యిని జమ చేసుకోవటం-సంతోషంగా కొనసాగించేశాడు. నెల గడిచాక చక్కగా ఆ నెయ్యిని అమ్ముకోవచ్చు!



ఊరి జనాలకి అతనిలో ఇంత మార్పు ఎలా వచ్చిందో అర్థం కాలేదు. ఇదంతా శివపరమాత్ముని లీల అనుకున్నారు వాళ్ళు. అందరూ వరదయ్యను మర్యాదగా చూడసాగారు. అందరూ తనను ఇప్పుడు గౌరవంగా చూస్తుంటే వరదయ్య లోలోపల వాళ్ల అమాయకత్వాన్ని తలచుకొని ముసిముసిగా నవ్వుకునేవాడు.

కొన్నాళ్ళకు ఆ ఋషి గ్రామంవదలివెళుతూ, గ్రామస్తులను పిలిచి- "అయ్యలారా!మనం ఒకగుమ్మడి గింజను నాటితే అది మనకు ఎన్నో గుమ్మడికాయలు ఇస్తుంది. మనం ఒక మామిడి టెంకను నాటితే వందల, వేల మామిడికాయల్ని- మనమేకాక, మన తర్వాతి తరాలవాళ్ళుకూడా- తింటారు. రైతులు ఒక బస్తా విత్తనాలని పొలంలో చల్లితే, ఎన్నో బస్తాల ధాన్యం లభిస్తుంది. ఈ పూజలు పునస్కారాలు ఉన్నది మనకు త్యాగభావాన్ని నేర్పేందుకే: 'మనం కొంత ఇస్తే దానికి ప్రతిఫలంగా మనకు ఎన్నో రెట్లు లభిస్తాయి' అని చెప్పేందుకు! అంతేకాదు; వేప విత్తనం నాటితే వేప మొక్క, కరివేప విత్తనం నాటితే కరివేప మొక్క మొలుస్తాయి. మనం ఇచ్చిన దానికి తగిన ఫలితం తప్పకుండా లభిస్తుంది. ఈవిషయం తెల్సుకుని, మీ తోటి వారికి సాయపడండి. నిజానికి దేవుడు ఎప్పుడూ కానుకలు, ముడుపులు కోరడు. త్యాగభావంతో బ్రతకమనేదే ఆయన మనకిచ్చే

సందేశం. మీరంతా ఈ 40 దినాలుగా భగవంతునికి ఏమేమి అర్పించారో అవే మీ ఇంట ఇబ్బడి ముబ్బడిగా వృద్ధి పొందుగాక!" అని చెప్పి వెళ్ళిపోయాడు.

అంతా ఇళ్ళకు వెళ్ళారు. ఆ రోజునుండీ ఊళ్ళో వాళ్ళందరి ఆవులు, గేదెలు రెట్టింపు పాలిచ్చాయి. వరదయ్య పశువులు మాత్రం ముక్క కంపుగొట్టే పిండి పాలు ఇవ్వసాగాయి.

దేవుడికి టోపీ పెట్టబోయిన వరదయ్యకు తగిన శాస్తి జరిగిందని ఊళ్ళో వాళ్లంతా చెప్పుకున్నారు- వాళ్ళకెలా తెలిసిందో మరి, ఈ రహస్యం!

జోకులు

పేరు కుంపటి!

బ్రహ్మానందం: ఏంట్రా! వేరు కుంపటి పెట్టావట, ఏమైనా గొడవలా?

సునీల్: కుంపటి ఎక్కడుందిరా, అది దొరక్క గ్యాస్ పొయ్యే పెట్టుకున్నాను.

గొడుగు భద్రం!

తల్లి: ఒరేయ్ వానలో తడుస్తూ వెళుతున్నావ్- గొడుగు తీసుకెళ్లరా!

కొడుకు: అమ్మో, కొత్త గొడుగు తడిసిపోదూ...!

మ్యాజిక్కు!

ప్రొప్రయిటర్: ఆ మెజీషియన్‌ని ఎందుకు రానిచ్చావయ్యా, మన హోటల్‌కి?

సర్వర్: ఏమైంది సార్?

ప్రొప్రయిటర్: భోంచేసి డబ్బులివ్వకుండా మాయమై పోయాడు- ఇప్పుడేం చేద్దాం?

సేకరణ: సుచరిత



నిజాయితీ

కథనం: శ్రీమతి రాధ మండువ, ఉపాధ్యాయిని, ఋషివ్యాలీస్కూల్, మదనపల్లి.

చంద్రగిరి ప్రక్కన వెంకటాపురం అనే పల్లెలో సీతయ్య అనే రైతు ఉండేవాడు. అతని భార్య సరోజమ్మ. పిత్రార్జితంగా వచ్చిన కుంట పొలం తప్ప, వేరే ఆస్తిపాస్తులేమీ లేవు వాళ్ళకు. తన పొలంలో పని లేనప్పుడు ఇరుగు పొరుగు పొలాల్లో కూలికి వెళ్ళేవాడు సీతయ్య. ఇక సరోజమ్మేమో గుట్టల మీద, గట్ల మీద పెరిగే గడ్డిని కోసి, కట్టలు కట్టి, పట్నంలో అమ్మేది. అయినా వాళ్లకు, వాళ్ల ఇద్దరు పిల్లలకు మూడు పూటలా తిండికి జరగడానికి కష్టంగానే ఉండేది.

ఒకరోజు సీతయ్య పొలం నుండి ఇంటికి వచ్చేప్పటికి, అతని ఇంటి ముందు ఒక ఆవు కట్టేసి ఉంది! సీతయ్య ఆ ఆవు దగ్గరకు వెళ్ళి " ఆహా! ఎవరిదో ఈ ఆవు. ఇది నాదైతే తిరుపతి కొండకి నడిచి వెళ్ళి స్వామి దర్శనం

చేసుకోనూ? " అని అప్రయత్నంగా అనేశాడు.

అంతలో భర్తను చూసిన సరోజమ్మ బయటకు వచ్చింది.

"ఎవరిదీ ఆవు, సరోజా!" అని అడిగాడు సీతయ్య.

"మన ఇంటి ముందున్న పచ్చగడ్డిని తినడానికి వచ్చింది. చుట్టుప్రక్కల అందరినీ విచారించాను. 'ఎవరైనా అడుగుతూ వస్తే ఇవ్వొచ్చులే' అని కట్టేశాను" అంది సరోజమ్మ.



నెల రోజులు గడిచాయి. కానీ ఆవు కోసం ఎవరూ రాలేదు! రోజూ సరోజమ్మే, దానికి గడ్డి, నీరు పెట్టడం, సంరక్షించటం, పాలు పితికి అమ్ముకోవటం చేస్తోంది.

సరోజమ్మ సంతోషంగానే ఉంది గానీ, ఆ ఆవు వచ్చిన రోజు నుంచీ ఎందుకో సీతయ్యకు మనసులో దిగులుగా ఉంటోంది. 'ఈ ఆవు నాదైతే కొండకు వస్తానని మొక్కుకున్నాను కదా! మొక్కు తీర్చుకోకపోవటంవల్ల నాకు దిగులుగా ఉందేమో!' అనుకుని, మర్నాడే మొక్కు తీర్చుకోవడానికి కొండకు నడవడం మొదలుపెట్టాడు.

సాయంత్రం చీకటి పడే వేళకు కొండ మీదకు చేరుకున్నాడు. రాత్రికి సత్రంలో బస చేశాడు.

ఆ రాత్రి అతనికి కలలో వెంకటేశ్వర స్వామి కనిపించాడు- "సీతయ్యా! ఏదో ఆవు నీ దగ్గరికి వస్తే, కనీసం అది ఎవరిదో కూడా విచారించకుండా మీ ఇంట గాటకు కట్టేసుకున్నావు. నువ్వు విచారించలేకపోతే పాయె- కనీసం గ్రామాధికారికైనా ఆవుని అప్పగించాలి కదా!" అన్నాడు.

దిగ్గున లేచి కూర్చున్నాడు సీతయ్య. వేకువనే

స్వామి దర్శనం ముగించుకుని ప్రసాదంతో ఇంటికి చేరాడు. ఆవుతో బాటు కొంచెం ప్రసాదాన్ని కూడా తీసుకొని గ్రామాధికారి దగ్గరకు వెళ్ళాడు. జరిగిన విషయాన్నంతా దాచకుండా చెప్పాడు ఆయనకు. గ్రామాధికారి సీతయ్యను మెచ్చుకొని ఆ ఆవుని ఊరి బందెలదొడ్డిలో కట్టేయించాడు.



కొన్నాళ్ళు గడిచాయి. సీతయ్య, సరోజమ్మ ఆ ఆవు సంగతి దాదాపు మరచే పోయారు. అకస్మాత్తుగా ఒకరోజున చంద్రగిరి జమీందారుగారు మేనాలో సీతయ్య ఇంటికి వచ్చారు, గ్రామాధికారిని వెంట బెట్టుకొని. ఊరి జనం అంతా ఆయన్ని చూసేందుకని సీతయ్య ఇంటి ముందు గుమిగూడారు.

జమీందారుగారు మేనా దిగి వచ్చి సీతయ్యను ఆదరంగా దగ్గరకు తీసుకొని "సీతయ్యా! మీ ఇంటికి చేరిన ఆవు మా మందలోనిది. జరిగిన సంగతులన్నీ చెప్పారు గ్రామాధికారిగారు. నువ్వు నిజాయితీపరుడివి కనుకనే స్వామి నీకు కలలో కనిపించాడు. ఇదిగో! నీ మంచితనానికి, భక్తి శ్రద్ధలకు మెచ్చి మేం ఇచ్చే చిన్న కానుక-ఈ డబ్బు తీసుకుని రెండు ఆవులను కొనుక్కో" అని డబ్బు మూటను సీతయ్య చేతిలో పెట్టారు.

సీతయ్య జమీందారుగారికీ, గ్రామాధికారికీ కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. జమీందారు గారు ఇచ్చిన డబ్బుతో రెండు ఆవులను తెచ్చుకొని సుఖంగా జీవించాడు.



ధర్మసంకటం

మూలం:పర్తాప్ అగర్వాల్, స్టోరీస్ ఫర్ ఎ డాటర్ *తెలుగు అనుసరణ:నారాయణ, కొత్తపల్లిబృందం.*

ఊళ్లో ఒక కిరాణా దుకాణం నడిపిస్తాడు మోహన్‌సింగ్. అతను ఏమంత ధనికుడు కాదు; కానీ అతనిది జాలిగుండె. దాంతో ఎప్పుడూ ఏదో ఒక మంచిపనిని నెత్తిన వేసుకొనే ఉండేవాడు. ఊళ్లో జనాలందరికీ ఉపయోగపడే పని ఏది ఉన్నా, ప్రతిసారీ అతను ముందుపడి, దాని కోసం ఎంతో కొంత ఖర్చు చేసేవాడు. అంతేకాదు, అలాంటి పనుల-కోసమని తన సంపాదనలోంచి కొంత డబ్బును తీసి ప్రక్కన వేసేవాడు కూడా.

పట్టణానికి పోయే తారురోడ్డు ఊరి నుండి అర్థ కిలోమీటరు దూరంలో ఉంది. ఆ దారిన పోయే వాళ్లకు ఎవరికైనా దాహం వేస్తే ఆ అర కిలోమీటరూ నడిచి ఊళ్లోకి రావలసిందే- అక్కడికి దగ్గర్లో త్రాగు నీటి సౌకర్యం వేరే ఏదీ లేదు మరి! దీన్ని గమనించిన మోహన్‌సింగ్, తారు రోడ్డుకు దగ్గరగా ఒక బావి

త్రవ్వించాలనుకున్నాడు. బావి చాలా ఖర్చుతో కూడుకున్న పని కదా, దానికోసం ప్రత్యేకంగా మోహన్‌సింగ్ కొంత కాలంపాటు పొదుపు చేయాల్సి వచ్చింది. చివరికి ఎలాగైతేనేమి, తారురోడ్డును ఆనుకొనే చక్కని ఊటబావి ఒకటి తయారైంది. వచ్చే పోయే బాటసారులకి ఆ బావి చాలా సాయమైంది. ఊళ్లో వాళ్లకూ చాలా ఉపయోగపడింది ఆ బావి. పశువుల్ని తోలుకొని వెళ్లే కాపరులకు కూడా దాహం తీర్చుకునేందుకు ఒక చక్కని వసతి అయ్యింది. పశువులకు మధ్యలో నీళ్లు పెట్టటం సులభమైంది ఇప్పుడు. ముఖ్యంగా నాట్ల సమయంలోనూ, కోతల సమయంలోనూ అటు వైపున పొలాలున్న రైతులందరికీ చాలా సమయం కలిసి వచ్చినట్లయింది. ఊళ్లో ప్రతి ఒక్కరూ మోహన్‌సింగ్ చేసిన మంచిపనిని గురించి గొప్పగా చెప్పుకున్నారు. కొందరు అతని ఇంటికి వెళ్లి మరీ చెప్పారు- ఆ బావివల్ల తమకు ఎంత మేలు జరిగిందీ. అందరూ అతన్ని ఎంతగానో పొగిడారు.

మోహన్‌సింగుకు ఇదంతా చాలా సంతోషాన్నిచ్చింది. అయితే మంచిపనులు చేయటం అతనికి ఏమంత కొత్తకాదు గనక, ఈ పొగడ్తలకు అతను పెద్దగా ఉబ్బి పోలేదు.



కొన్నాళ్లకు అనుకోని సంఘటన ఒకటి జరిగింది. రోడ్డు మీద పోతున్న ప్రయాణీకుడెవరో ఆ బావిలో పడి, మునిగి పోయాడు. అతనికి ఈత రాదేమో- మరి అతని కంటి చూపు సరిగా లేదో, లేకపోతే తప్ప తాగి ఉన్నాడో ఏంజరిగిందో ఎవ్వరికీ తెలీదు- ఊళ్లో వాళ్లంతా వెళ్లి బావినీ, అతని శవాన్నీ చూశారు. చూసిన ప్రతివాళ్లూ చాలా బాధపడ్డారు. చనిపోయిన వ్యక్తి పట్ల సానుభూతి వ్యక్తం చేశారు. మోహన్‌సింగ్

కూడా పాపం చాలా బాధపడ్డాడు.

అయితే అదే సమయంలో అతని దు:ఖాన్ని మరింత పెంచే మాటలు కొన్ని మొదలయ్యాయి. ఊళ్లో జనాలు కొందరు మోహన్‌సింగును విమర్శించటం మొదలు పెట్టారు- "ఇదంతా మోహన్‌సింగ్ తప్పే. అతను ఇంకొంచెం జాగ్రత్త వహించాల్సింది. ఊరికి ఇంత దూరంగా, రోడ్డుకు అంత దగ్గరగా బావిని త్రవ్వటం మొదటి తప్పు. బావి చుట్టూ గోడను సరిగ్గా కట్టకపోవటం రెండోతప్పు. అసలు ఇవన్నీ చేసేముందు అతను గ్రామ పంచాయితీ అనుమతినైనా అడిగాడా, అసలు? లేదు! అసలు అతను కేవలం గొప్ప పేరు సంపాదించుకోవటం కోసమే ఇట్లాంటి పనులు చేస్తున్నాడు. తను చేసే పనులవల్ల ఎందరు అమాయకుల ప్రాణాలు పోతాయో అతనికి పట్టదు" అని.

ఈ మాటలకు మోహన్‌సింగ్ మరింత క్రుంగి పోయాడు. ఎవ్వరితోటీ మాట్లాడకుండా ఇంట్లోనే ముడుచుకొని ఉండిపోయాడు చాలా రోజులు.

అయితే లోతుగా ఆలోచించిన మీదట అతనికి ఒక సంగతి బాగా అర్థమైంది- "మామూలు జనాలకి ఆలోచనాశక్తి కంటే, విషయాలకు అప్పటికప్పుడు స్పందించేసే అలవాటు చాలా బలీయంగా ఉంటుంది. ఏ సంఘటన పట్లా వాళ్లకి స్పష్టమైన ఆలోచనా ఉండదు; నిశ్చితమైన అభిప్రాయమూ ఉండదు. అందువల్ల వాళ్ల స్పందనలు కూడా అటూ ఇటూ ఊగిసలాడుతూ ఉంటాయి. ఇక, ఇప్పుడు జరిగిన ప్రమాదం లాంటివి మన జీవితంలో ఒక భాగం. ఎన్నెన్ని జాగ్రత్తలు తీసుకున్నా, ఇలాంటివి జరిగే అవకాశాన్ని మటుకు పూర్తిగా తుడిచి వెయ్యలేం! అందుకని, మనం మంచి పనులు చేసేందుకు ఏ మాత్రం జంకకూడదు: అయితే పొగడ్తల్నీ, విమర్శల్నీ రెండింటినీ ఒకే రకంగా తీసుకోవటం అలవరచుకోవాలి. అది గనక జరిగితే ఇక ఏ సమస్యా ఉండదు."

ఒకసారి ఈ నిశ్చయానికి వచ్చాక, మోహన్‌సింగ్ మరిన్ని మంచి పనుల్ని ధైర్యంగా చేపట్టాడు.



తలగుమ్మడి కథ

కొత్తపల్లి పత్రిక ఏప్రియల్ 2011 సంచికలో 'బొమ్మకు కథ రాయండి' అని ఇచ్చిన బొమ్మకు కథ ఇది! కొంచెం చాలా మాంత్రికంగానూ, అద్భుతంగానూ ఉండే ఇలాంటి కథలు మీకూ చాలానే వచ్చి ఉంటాయి గదూ?

రచన: శ్రీమతి జి. లలిత, telugu4kids.com

పూర్వం, భారత దేశానికి ఈశాన్య ప్రాంతంలో జనద్వీపం అనే కుగ్రామం ఉండేది. చుట్టూ పర్వతాలు ఉండి బయటి ప్రపంచంతో ఆ ఊరికి సంబంధాలు ఎక్కువ ఉండేవి కావు. తర తరాలుగా ఆ ఊరి ప్రజలు తమకు ఉన్న దాంట్లోనే సంతృప్తి పడుతూ, తమకు తెలిసినదే ప్రపంచంగా జీవించసాగారు. ఆ ప్రాంతం దాటి వెళ్ళి కొండలకి అవతల ఏముందో తెలుసుకోవాలనే కుతూహలం పిల్లలోనూ, ఆ ఊరు వదిలి వెళ్తే జరగరానివి జరుగుతాయనే భయం పెద్దలలోనూ ఉండేవి. అందుకు కారణం లేకపోలేదు.

ఆ ఊళ్ళో నూట పదేళ్ళ ముసలి తాత ఉండేవాడు. అతని పేరు తలగుమ్మడి. అతని పేరు ఎంత విచిత్రమో, అతని తీరూ అంతే

విచిత్రంగా ఉండేది. అతను ఒంటరిగా ఉండే వాడు. అతని కుటుంబం గురించి ఆ ఊళ్ళో ఎవరికీ ఏమీ తెలియదు. అతని ఇంట్లో ఎన్నో వింత వస్తువులుండేవి. అవన్నీ తన చిన్న తనంలో జనద్వీపం వదిలి దేశాటన చేసిన రోజులలో పోగు చేసినవి అని చెప్పేవాడు తలగుమ్మడి. వాటిని చూసి పిల్లలెవరైనా జనద్వీపం బయట ఏముందో తెలుసుకోవాలని కుతూహలం కనబరిస్తే, "బయటికెళ్తే మీ తలలు గుమ్మడి కాయలైపోతాయి. నాకు అదే జరిగింది. అందుకే నా పేరు "తలగుమ్మడి" అయ్యింది. నమ్మరా?" అంటూ తలకి ఉన్న టోపీ తీసి చూపించే వాడు. టోపీ కింద తలగుమ్మడికి బట్ట తల ఉండేది. ఆ బట్ట తల ఉన్న మేరా, అతని చర్మం గుమ్మడి కాయ రంగులో ఉండేది.

అది చూసి పిల్లలు కొంత భయపడే వాళ్ళు, కొంత ఆశ్చర్యపడే వారు. అక్కడ రంగేమన్నా పూసుకున్నాడేమో అని గీకి చూడడానికి సాహసించే వాళ్ళు కొందరు. మొత్తానికి ఎన్ని సార్లు చెప్పినా అడిగి మరీ అతని కథ చెప్పించుకునే వారు పిల్లలందరూ. ఆ కథ ఇది:

తలగుమ్మడి తల గుమ్మడి కాయ కాక ముందు అతని పేరు దిమ్మరి. దిమ్మరి ఒక సారి ఇంట్లో ఎవ్వరికీ చెప్ప పెట్టకుండా, తనకి తోచిన తిండీ, బట్టలూ మూట కట్టుకుని ఊరికి తూర్పున ఉన్న కొండ కనుమల గుండా దారి వెతుక్కుంటూ, కొండ అవతలి వైపుకి వెళ్ళాడు. అక్కడ తమ ఊరి కంటే పది రెట్లు పెద్దగా ఉన్న జనవాసం కనిపించింది. ఆశ్చర్యపోయాడు. తీరా వెళ్ళి వాళ్ళని పలకరిస్తే, వాళ్ళకి తన భాష తెలియదని అర్థమయ్యింది. కష్టపడి సైగలతో తను కొండకి అవతల వైపు నుంచీ వచ్చానని వాళ్ళకి చెప్పాడు. వింతగా చూస్తూనే అతనిని ఆదరించారు. మెల్లగా ఊరి వాళ్ళతో పరిచయాలు పెరిగి, వారి భాష కూడ నేర్చుకున్నాడు.

అలా ఉంటుండగా ఒక సారి ఆ ఊరికి ఒక గారడీ బృందం వచ్చింది. వాళ్ళంతా విచిత్ర వేషధారణతో, వింత చేష్టలు చేస్తూ ఊరి వారికి వినోదం కల్పించారు. దిమ్మరికి వారిని చూసి

తానూ వారితో పాటు ఊళ్ళు తిరిగి వినోదం చేస్తూ జీవితమంతా సరదాగా గడిపేయ వచ్చునని ఆశ కలిగింది. అనుకున్నదే తడవు వారితో ఆ మాట చెప్పాడు. వాళ్ళు కూడా వెంటనే అతనిని తమ బృందంలో చేర్చుకోవడానికి ఉత్సాహం చూపించడంతో పొంగిపోయాడు. ఆ గారడీ బృందంతో పాటు ఊరు వదిలి వెళ్ళిపోయాడు. ఊరు దాటాక కానీ అతనికి తెలియలేదు, తనెంత పొరపాటు చేశాడో. తనకి గారడీ నేర్పించే బదులు ఆ బృందం తన చేత పనులు చేయించుకోసాగారు. కడుపు నిండా తిండి దొరకక, క్షణం విశ్రాంతి దొరకక, చాలా కష్టపడసాగాడు దిమ్మరి.

ఆ కష్టాలు భరించలేక ఒక రాత్రి ఆ బృందం వేసుకున్న గుడారాలనించి పారిపోబోతుండగా పట్టుబడిపోయాడు. గారడీ బృందం నాయకుడు, 'నీకు వినోదం కావాలా? ఐతే, ఇదుగో చూడు!" అంటూ దిమ్మరి తలను గుమ్మడి కాయగా మార్చేశాడు. దిమ్మరికి తల దిమ్మెక్కి పోయింది. అప్పుడు గారడీ బృందం నాయకుడు, "ఈ రోజు నుంచీ నీ పేరు 'తలగుమ్మడి '. ఇక నుంచీ నువ్వు తలలు అమ్ముకుంటూ బతుకు!" అంటూ ఒక గుర్రమూ, ఒక మూటలో కొన్ని తలకాయలూ, కొంత డబ్బూ ఇచ్చి అక్కడ్నుంచీ పంపేశాడు. వెళ్ళే ముందు అతని చెవిలో ఒక రహస్యం చెప్పాడు. తలగుమ్మడి విధి లేక గుర్రమెక్కి బయలు దేరితే వెనకాల గారడీ వాళ్ళంతా గట్టిగా నవ్వడం వినిపించింది.



తలగుమ్మడి ఊళ్ళు తిరుగుతూ, "అందమైన ముఖం కావాలన్నా, తెలివితేటలు రెట్టింపవ్వాలన్నా, బట్టతల పోయి జుట్టు బాగా పెరగాలన్నా, కొనుక్కోండి, కొత్త తలకాయలు!" అంటూ అరుస్తూ తిరగ

సాగాడు. ఆశ కొద్దీ ఒకరిద్దరు పెద్ద మొత్తంలో డబ్బులిచ్చి అతని దగ్గర తలలు కొనుక్కునే వారు. అవి పెట్టుకోగానే వారి తలలూ గుమ్మడి కాయలైపోయేవి. అప్పుడు వారికీ కొన్ని తలలిచ్చి, గారడీ బృందం నాయకుడు తనకి చెప్పిన రహస్యం వాళ్ళకీ చెప్పి అమ్ముకోమని పంపే వాడు తలగుమ్మడి. ఐతే ఒకసారి తలలు గుమ్మడికాయలౌతాయని ఒక చోట తెలిసిన తర్వాత ఇక ఆ ఊళ్ళో మనలేక పరుగు పరుగున ఇంకో ఊరికి వెళ్ళే వాడు.

ఆఖరికి విద్యాపురం అనే ఉరు చేరి, సంతలో, ఎప్పటిలాగే, "అందమైన ముఖం కావాలన్నా, తెలివితేటలు రెట్టింపవ్వాలన్నా, బట్టతల పోయి జుట్టు బాగా పెరగాలన్నా, కొనుక్కోండి, కొత్త తలకాయలు!" అని అరుస్తుంటే జనమంతా పోగయ్యి వింతగా చూడ సాగారు. అందులో ఒకరిద్దరు డబ్బులిచ్చి కొత్త తలకాయలు కొనుక్కోవడానికి సిద్ధమౌతుండగా, ఒక చిన్న పిల్లాడు, "ఓ తలలు అమ్మే తలలేని మనిషీ, నీ గుమ్మడి కాయ తల తీసి నువ్వే ఒక కొత్త తలకాయ పెట్టుకోవచ్చు కదా?" అని అడిగాడు. అంతే, తలగుమ్మడికి ఆ క్షణం గుమ్మడి కాయ తల పోయి, తన స్వంత తల వచ్చేసింది. ఆ గారడీ బృందం నాయకుడు తనకు చెప్పిన రహస్యం అదే: ఎవరైనా, తనకు గుమ్మడి కాయ తల తీసేసి అసలు తల పెట్టుకోమని సూచించగానే తనకి అసలు తల వచ్చేస్తుందని! అలా అసలు తల రాగానే, తలగుమ్మడి సంతోషంతో తన మూటలో ఉన్న డబ్బంతా ఆ పిల్లాడికిచ్చేసి, పరుగు తీశాడు. అలా పరుగు తీసిన వాడు ఎప్పుడు, ఎక్కడ, ఎలా ఆగాడో గుర్తు లేదు కానీ, కళ్ళు తెరిచి చూసే సరికి జనద్వీపంలో ఉన్నాడు.

ఐతే, ఒక ఆకతాయి పిల్లాడు వెంటనే అడిగాడు కదా, "తాతా, మరి అన్నీ వదిలేసి పరిగెత్తుకు వచ్చిన నీ దగ్గరకి, దేశ దేశాలనించీ తెచ్చిన వింత వస్తువులెలా వచ్చి చేరాయి?" అని.

“అబ్బో! అది ఇంకో పెద్ద కథ. మళ్ళీ ఎప్పుడైనా చెబుతానులే. అప్పటివరకూ ఈ గుమ్మడి కాయల కథ చాలు" అన్నాడు

తలగుమ్మడి, తలనిండా ముసుగు కప్పుకుంటూ.

“ఒరే! ఈ తాతకి కథలు చెప్పటం బాగా వచ్చురా! అన్నీ కల్పితాలే" అని విరగబడి నవ్వాడు పిల్లవాడు.


"కల్పితం కథలతో మనల్ని భయపెట్టాలని చూస్తున్నాడు. మనం వెళ్ళిపోతే ఈ తాతకు పొద్దు ఎలా గడుస్తుంది?” అని నవ్వారు మిగిలిన పిల్లలంతా.

గడుసు తాత ముసుగులోంచే చూస్తూ ముసిముసిగా నవ్వాడు.

చిలిపి ప్రశ్నలు-తిక్క జవాబులు

ప్రశ్న: తెలివైన గవర్నమెంటు ఉద్యోగి ఆఫీసుకు ఎందుకు వెళ్తాడు?

జవాబు: నిద్రపోయేందుకు.




ప్రశ్న: నేటి రాజకీయ నాయకుల ఆలోచనా స్థితి ఎలావుంది!?

జవాబు: దూరాలోచనకు తక్కువ; దురాలోచనకు ఎక్కువ!!



ప్రశ్న: తెలివైన టి.వి. ఛానల్ యజమాని ఏం చేస్తాడు!?

జవాబు: మధ్యాహ్నం "మా ఛానల్ వంట" కార్యక్రమం తర్వాత స్టాఫ్ కి "ఉచిత భోజన సౌకర్యం" అని ప్రకటిస్తాడు!!



నిర్వహణ: శ్రీవి.వి.యస్.మూర్తి, చోడిమళ్ళ.

తొలకరి జల్లులు జీవమురా!

వానలు బాగా కురవాలంటే మనం ఏంచేయాలి? ఈ పాటనుండి తెలుసుకోండి!
సేకరణ, గానం: అభ్యాస విద్యాలయం బాలలు, విజయవాడ.



తొలకరి జల్లులు జీవంరా
మొలకలు పంటకు ప్రాణంరా
వానలు బాగా కురవాలంటే
వనములు మనము పెంచాలి

"తొలకరి"

మట్టిలో దాగిన వేర్లన్నీ
చెట్టుకు నీటిని ఇస్తాయి
చెట్టులో చేరిన నీరంతా
ఆకులలోనికి పోతుంది
"తొలకరి"

సూరీడు ఆకులపై
వేడెంతో విడువంగా
ఆకులలోని నీరంతా
ఆవిరిగా మారుతుంది
"తొలకరి"

ఆవిరి మేఘం అవుతుంది

నల్లని మబ్బైపోతుంది
చిటపట చినుకుల ఒరవడిలో
చల్లని జల్లైపడుతుంది
"తొలకరి"

వడివడిగా ఒక ఒరవడిగా
కురిసేటి ఆ వర్షాలు
అడవుల్లో అల్లుకుపోయిన
ఆకులపై పడతాయి
"తొలకరి"

ఆకులపై నిలచిన నీరు
ఎండకు ఆవిరి అవుతుంది
అందుకనే అడవుల్లో
తరచుగ వానలు వస్తాయి

అందుకే-
వానలు మనకు కావాలంటే
వనములు మనము పెంచాలి.
"తొలకరి జల్లులు జీవంరా.."



రంగురంగుల పువ్వులు

రచన: శ్రీవారణాసి వెంకట్రావు, విజయవాడ.
గానం: జగన్ సంప్రీత్, రామ్ సంప్రీత్, దీప, 9 వ తరగతి, విజయవాడ.
సౌజన్యం: విద్యార్థి సృజన కుటీర్, విజయవాడ వారి 'రంగులపూలు'

రంగు రంగుల పువ్వుల్లాంటి పిల్లలారా
హరివిల్లుల్లారా-
వచ్చింది వచ్చింది వానాకాలం
వచ్చింది వచ్చింది వానాకాలం
సెలవుల కాలం గడిచి-
మళ్లీ బళ్లు తెరిచారు
బద్ధకానికి మొద్దు నిదురకు
స్వస్తి చెప్పి మేలుకోండని
గర్జిస్తూ ఆకసాన
తెలితెలి మబ్బులు చెబుతున్నాయి-
విన్నారా విన్నారా విన్నారా?
"రంగు రంగుల"
వడగాడ్పులకు ఓర్వలేక
ఉసురుసురంటూ ఊసుపోక
అల్లరిచేయక ఇళ్లలోనే
ఇరుక్కుపోయిన పిల్లలారా
చిందులు వేస్తూ రారండంటూ
చిటపట చినుకులు పిలుస్తున్నాయ్-
విన్నారా విన్నారా విన్నారా?
"రంగు రంగుల"
ఊరకనే అలసట చెందే
వేసవికాలం వెళ్లింది
కొత్త క్లాసులు పుస్తకాలు
చూస్తే వచ్చును మీకే హుషారు
రంగు రంగుల బట్టలు వేసుకు
రండి పిల్లలారా అంటూ
తొందర చేసే ఇంద్రధనస్సును
చూశారా చూశారా చూశారా?
"రంగురంగుల"

క్వాక్ క్వాక్ క్వాక్!

రచన: శ్రీ బాలాంత్రపు రజనీ కాంత రావు
గానం, సౌజన్యం: సెంటర్ ఫర్ చైల్డ్ సెంటర్డ్ ఎజుకేషన్, విజయవాడ.

క్వాక్ క్వాక్ క్వాక్! క్వాక్ క్వాక్ క్వాక్!
క్వాక్ క్వాక్- క్వాక్ క్వాక్- క్వాక్ క్వాక్ క్వాక్!

ఓహో బాబూ ఓహో పాపా
ఓహో బాబూ ఓహో పాపా
ఎక్కడికెళుతున్నారర్రా?
అని బళ్ళోకెళ్ళే బాబుని పాపని
దార్లో ఒక బాతడిగింది

క్వాక్ క్వాక్ క్వాక్! క్వాక్ క్వాక్ క్వాక్!
క్వాక్ క్వాక్- క్వాక్ క్వాక్- క్వాక్ క్వాక్ క్వాక్!

పాఠం చెప్పే పంతులుగారికి
పళ్ళీయడానికి వెళ్తున్నామని
బాతు భాషలో పాపంటే విని
బాబు ఫకాలున నవ్వాడు

చిట్టి చేతిలో పళ్ళు పుచ్చుకొని
పొట్టి కాళ్లతో గునగూన ఊగుతు
బాతుల్లాగే పోతున్నారే
నాతో నేస్తం కడతారా?
అని బళ్ళోకెళ్ళే బాబుని పాపని
దార్లో ఆ బాతడిగింది

నేస్తం నీతో కడితే
మాకేమిస్తావో చెబుతావా బాతూ?

క్వాక్ క్వాక్ క్వాక్! క్వాక్ క్వాక్ క్వాక్!
క్వాక్ క్వాక్- క్వాక్ క్వాక్- క్వాక్ క్వాక్
అంటూ బాతు భాషలో బాతంటే విని



బాబు ఫకాలున నవ్వాడు

బళ్ళోకెళుతూ నేస్తం కడితే
దార్లో సాయం వస్తానర్రా
చెర్లో తామరలిస్తానర్రా
బళ్ళో పంతులుకివ్వండంటూ
బళ్ళోకెళ్ళే బాబుని పాపని
దార్లో ఆ బాతడిగింది

'క్వాక్ క్వాక్ అంటుందేమిటి బాతు-
అక్కా?' అని బాబడిగాడప్పుడు

క్వాక్ క్వాక్ అంటే గమ్మత్తు కాదు
చక్కని బాతుల భాషరా అది
క్వాక్ క్వాక్ క్వాక్! క్వాక్ క్వాక్ క్వాక్!
క్వాక్ క్వాక్- క్వాక్ క్వాక్- క్వాక్ క్వాక్ క్వాక్!
బాతు భాష అని పాపంటే విని
బాబు ఫకాలున నవ్వాడు!
బళ్ళోకెళ్ళే బాబూ పాపా బాతూ నేస్తం కట్టారు.

ఈ పాటని ఎలా పాడుకోవాలో తెలీటం లేదా? అయితే ఇంటర్నెట్‌లో http://kottapalli.in ని సందర్శించండి. అక్కడ ఈ పాటలన్నిటినీ వినే వీలున్నది!

పదరంగం-4

ఈ పదరంగం చాలా సులభం! దీన్ని పూరించి పంపండి. మీ పేరుతో బాటు మీ బడి పేరు, తరగతి తప్పక రాయండి. సరైన సమాధానాలు పంపిన పిల్లల పేర్లను పదరంగం-6 తో పాటు ప్రచురించగలం.
నిర్వహణ: దేవి, బెంగుళూరు.

1	2				3
				4	
5					
			6		7
8		9			
		10			

ఆధారాలు:


అడ్డం:

1. ఆంధ్ర రాష్ట్రపు నృత్య రీతి (4)
4. అందంగా మలచిన శిల (2)
5. తేడా (3)
6. కొండను తొలిచి చేసే త్రోవ (3)
8. స్నేహం (3)
10. కౌరవులు-పాండవుల కథ తిరగబడింది (3)

నిలువు:

2. అతి వేగంగా పరుగెత్తే జంతువు (5)
3. అధికం కాదు (2)
4. ఆకులు రాలే ఋతువు (3)
7. బడిలోనూ, గుడిలోనూ మ్రోగేది (2)
8. కుక్క కాటుకు ఈ దెబ్బ (2)
9. కొంచెం (2)

పదరంగం-2 కి సమాధానం




సమీక్ష

ప్రతి మాసమూ మరికొన్ని కథల్నీ పాటల్నీ మోసుకొని వచ్చే కొత్తపల్లి మరీ పలచన అయితే అయిపోవట్లేదు గద? తెలిసో తెలీకో చాలా తప్పులేమీ చేయట్లేదు గద? కొత్తపల్లి వెలువడగానే ప్రతినెలా స్వతంత్రంగా సమీక్షించి పెట్టమని మాలతి గారిని అడిగాం..వారి సమీక్షా వ్యాసాల్లో ఇది మొదటిది.

వై.మాలతీకృష్ణ, విద్యార్థి సృజన కుటీర్, విజయవాడ.

పెద్దవాళ్ళు కథలు చెప్తారు; పిల్లలు వింటారు. అలాగే పెద్దవాళ్ళు పిల్లలకోసం కథలు వ్రాస్తారు- ఇది మామూలుగా జరిగేదే కానీ కొత్తపల్లిలో పిల్లలు కూడా కథలు వ్రాయటం, వాటిని చిన్నాపెద్దా అంతా చదువుకోవటం బాగుంది. పిల్లలకిదో అద్భుతమైన అవకాశం-'మీరేనా ఏంటి, మేమూ వ్రాయగలం, చూస్కోండి!' అని గొప్పలు పోడానికి.



ముందుగా కొత్తపల్లి ముఖచిత్రాల గురించి, సంపాదకీయం గురించి.

అట్టమీద బొమ్మలెప్పుడూ ప్రత్యేకంగానే ఉంటున్నాయి- కొత్తపల్లి స్ఫూర్తిని ప్రతిఫలిస్తూ. సంపాదకీయం మళ్ళీ మళ్ళీ చదువుకోవాలనిపించేట్టు, ప్రతిసారీ అంతే కొత్తగా ఉంటోంది; మనసును చిన్నగా కదుపుతోంది. 'శ్రమశక్తి'లోని సేవక చీమలకు తెలీదు- అవి దోచుకోబడుతున్నాయని. అలాగే ఎంతోమంది పిల్లలకూ తెలీదు- వాళ్ళ బాల్యం దోచుకోబడుతోందని. బాల్యంలో ఆనందాలు అనుభవిస్తేనేకదా, అవి కోల్పోతున్నామని తెలిసేదీ; బాధ కలిగేదీ? చల్లటి ఏటిగట్టున, ఇసుకలో పిచ్చుక గూళ్ళు కట్టుకుంటున్న పిల్లల్లో కనిపిస్తున్న తీరిక, ప్రశాంతతల రుచి కూడా వాళ్ళకు తెలీదుగా! వీరాంజనేయులు బొమ్మ మనసుకు హత్తుకున్నది.

'ఎవరు గొప్ప'(వ్రాసింది నికితా, నిఖితా?) చదివి తీరిగ్గా కూర్చొని ఆలోచించా- పాపం, అమాయకపు జంతువులన్నీ మనిషిని గొప్పవాడని ఒప్పేసుకున్నాయిగానీ, అసలు సంగతి మాత్రం మనిషి వాటన్నిటికంటే తెలివైనవాడు. తన లాభం కోసం దేన్నైనా వాడుకోగల, దేన్నైనా నాశనం చేయగల చావు

తెలివితేటలున్నవాడు..గొప్పవాడేం కాదు గదా, నిఖితా?

పట్నం గురించి ప్రగతికి బాగా తెలుసనుకుంటా- అక్కడి మనుషులు కాలుష్యాన్ని తప్పించుకు తిరగడానికీ, దానితో సహజీవనం చేయడానికీ నానా ప్రయత్నాలూ చేస్తారుగానీ, దాన్ని లేకుండా చేయడానికి మాత్రం ఏమీ చెయ్యరని. అందుకే మల్లయ్యని వెనక్కి పంపెయ్యడమే కరెక్టనుకుంది. ఈ కథ, దానికి వేసిన బొమ్మలేమో రాజుల కాలానికి చెందినవిగా ఉన్నె.. ఇంగ్లీషు పదాలు (బాటిళ్ళు..స్పూన్లు) వాడకుండా ఉంటే బాగుండేది ప్రగతీ!

చదువుతున్నది మూడో తరగతైనా, సొంతంగా చేస్తే ఏదైనా చక్కగా అర్థమౌతుందని చక్కగా చెప్పింది నందన. మీబళ్ళో నువ్వు అలాగే చదువుకుంటున్నావు గదూ, నందనా?

ఆమని పుట్టించిన వరాల పాము సీత, గీతలను బడికి పంపిందిగానీ, అసలు అలాంటి పిల్లలకి బడి మానాలనే అనిపించనివ్వని సరదా బడులని సృష్టిస్తే మరీ బాగుండేది. బళ్ళే గనక అలాగుంటే సీత, గీతలు బడి ఎందుకు ఎగ్గొడతారు, మరి?

హైమవతి గారి 'కాకి' కథ పెద్దదిగా ఉన్నా, చివరికంటా చదివించింది. 'పారిన ఉపాయం', 'పేరు మరచిన ఈగ'లు ఇదివరకే చదివిన కథలు. వాటిని అలాంటి కథలను స్వీయ రచనలుగా కాక, తిరిగి చెప్పినట్టు చెబితే బాగుండేదనిపించింది.

'అమ్మచెట్టు' కథలో బజరా (బమ్మిడి జగదీశ్వరరావు- బొమ్మిడి కాదు)గారి మార్కు కనిపించింది. చాలామంది కథలు వ్రాస్తారు కానీ, అవి ఏవయసు పిల్లల్ని ఉద్దేశించి వ్రాశారో ఆ వయస్సు పిల్లలకి చదివి వినిపిస్తే వాళ్లకి అర్థమయ్యేలా ఉండవు. 'అమ్మచెట్టు' మాత్రం నా ఐదేళ్ల కూతురికి చదివి వినిపిస్తే, ఎక్కడా అర్థం వివరించకుండానే పకపకమని నవ్వుకుని, మళ్ళీ చదవమని అడిగింది. బజరాగారికి ఇది అభినందనేగా!?

నాగలక్ష్మిగారి 'గమ్యం' చెప్పదలచుకున్న విషయాన్ని స్పష్టంగా చెప్పింది. అలాగే 'గులాబీ గర్వభంగం' కూడా. అనుసరణ ఏ భాషనుంచో చెబితే బాగుండేది.

నారాయణగారి 'కాపాడండి' ఎవరిని? డైనోసార్లనా? వాటినుంచి మనుషుల్నా, అర్థం కాలేదు గాని కథనం మాత్రం స్పీల్‌బర్గ్ సినిమా తరహాలో కొత్తగా అయితే ఉంది.

కష్టపడి ఆప్యాయంగా ఈ పుస్తకాన్ని అందించిన బృందమంతటికీ అభినందనలు.

పెద్ద పులి!

ఈ బొమ్మకు కథ రాయండి! *నిర్వహణ: శ్రీమతి జి.లలిత*, telugu4kids.com



ఈ బొమ్మను చూడండి: మీకేమనిపిస్తున్నది?

చాలా దట్టమైన అడవిలో చిలకమ్మ, ఎందుకనో ఏడుస్తున్నది. క్రింద పొదలో పెద్దపులి మాటు వేసి పొంచి ఉన్నది- ఎవరికోసమో?!

చిలకమ్మను ఏడిపించింది పెద్దపులేనా?

కాదేమో- చూస్తుంటే చిలకమ్మా, పెద్దపులీ స్నేహితుల్లాగా ఉన్నాయే?!

మీకేమైనా ఐడియాలొచ్చాయా, ఈ బొమ్మను చూశాక?

ఏదైనా కొత్త కథ ఒకటి తట్టిందా, మీ మనసుకు? వెంటనే కాయితం, పెన్నూ పట్టండి. ఆ కథను రాసి మాకు పంపించేయండి.

మా దగ్గర ఈ బొమ్మకు సరిపోయే కథ ఒకటి ఉన్నది- దానికంటే మీ కథ బాగుందనుకోండి, మీ కథనే కొత్తపల్లి పత్రిక ఆగస్టు సంచికలో ప్రచురిస్తాం!

మీ కథలు, ఐడియాలు పంపించాల్సిన చిరునామా:

కొత్తపల్లి, యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా-515101 ఇ-మెయిలు: team@kottapalli.in

వెల:

ప్రతి ఒక్కింటికి: 20 రూ.

12 భాగాలు: 240 రూ.

"కొత్తపల్లి ట్రస్టు" పేరిట యంవో/డిడిని ఈ చిరునామాకు పంపండి: కొత్తపల్లి ట్రస్టు, యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా- 515101, ఆంధ్రప్రదేశ్.

బ్యాంకు అక్కౌంటు వివరాలు:
"Kottapalli Trust",
A/c No. 0138101018809 (savings), Canara Bank, Chennekothapalli. IFSC: CNRB0000138

ఫోను: 08559 240222

ఇ-మెయిలు: team@kottapalli.in

ఈ నెలలో ఏపని-ఎవరిది?

ఆర్థిక వ్యవహారాలు, నిర్వహణ: సుబ్బరాజు

సంపాదకత్వం: నారాయణ

వెబ్సైటు, సమాచార సాంకేతికత: ఆనంద్

ముద్రణ: 'ముద్రిక' కృపాకరరావు

చిత్రాలు: వీరాంజనేయులు, అడవిరాముడు, శివ, వాసు, అనిల్, శంకర్, పవన్, మహేష్, వెంకట్, వై.రాజు.

కార్టూన్లు: 'విద్యార్థి' కృష్ణ, వివియస్ మూర్తి.

బొమ్మకు కథ: లలిత, telugu4kids

కథలు, పాటలు: చాలామంది పిల్లలు

ప్రత్యేక కృతజ్ఞతలు:

కార్టూన్ల వివియస్ మూర్తిగారికి, ప్రకృతి బడికి, టింబక్టు బడికి, అరవింద స్కూలుకు, విద్యార్థి సృజన కుటీరానికి, నందన గ్రామీణ పాఠశాలకు, వెంకటేశ్వర బాలకుటీరానికి, telugu4kidsవారికి, మాలతీ కృష్ణగార్లకి, ఇంకా పేర్లు రాయని అనేకమందికి.

ఇంటర్నెట్‌లో http://kottapalli.in వద్ద కొత్తపల్లి పత్రికను చదవండి.

అందరు పిల్లల కోసం మీరూ కథలు రాసి పంపండి.

చందాదారులుగా చేరి నెల నెలా కొత్తపల్లిని పోస్టులో మీ ఇంటికి తెప్పించుకోండి.

మీ మిత్రుల తరపున చందాలు కట్టండి.

మీకిష్టమైన బడులకు, గ్రంథాలయాలకు కొత్తపల్లిని బహూకరించండి.

అయ్యో! తెలుగు రాదే, ఎలాగ?!

"కథలమ్మా కథలు! కథలమ్మా కథలు! రకరకాల కథలు! తెలుగుపిల్లల కథలు!"

"ఏం కథలు బాబూ? మా పిల్లలకు తెలుగు చదవటం రాదు. ఇంగ్లీషు కథలు ఏమన్నా ఉన్నాయా, నీ దగ్గర?"

"ఇంగ్లీషువైతే వేరేవాళ్ళ దగ్గర దొరుకుతాయండి. నా దగ్గర ఉన్న సరుకంతా తెలుగువాళ్ల కోసమే. ఏం, మీ పిల్లలు తెలుగువాళ్ళు కారాండీ? పాపం, వాళ్ళకి కొంచెం తెలుగు నేర్పించకపోయారూ?"

"ఏమో నాయనా! మా వాళ్లకైతే ఇంగ్లీషు అంటేనే ఇష్టం. ఆ ఇంగ్లీషు నేర్చుకునేసరికే వాళ్ల తల ప్రాణం తోకకొచ్చింది. ఇంక తెలుగు ఎక్కడ నేర్చుకుంటారు?"

"అవున్లెండి, పాపం. కానీ నా దగ్గర ఉన్నవి తెలుగు కథలేనండి. మీకు పనికిరావు."

"ఏదీ, ఓసారి చూడనియ్యి- పుస్తకం బానే ఉన్నట్టుందయ్యా, కాయితం, రంగులు అదీనీ- దీన్ని పాపం ఇంగ్లీషులో అచ్చెయ్యకపోయారూ? మీకూ కొంచెం అమ్మకాలుండేవి గద! ఇప్పుడు పిల్లలంతా ఇంగ్లీషు బళ్లలో చదివీ చదివీ, తెలుగుని పూర్తిగా మరచేపోతున్నారుగా?"

"అవునండీ, అందుకనే వీటిని తెలుగులో మాత్రమే అచ్చేస్తున్నాం. మీ పిల్లలకి ఈ కథలు కావాలంటే వాళ్ళు తెలుగు నేర్చుకోవాల్సిందే, తప్పదు. లేకపోతే ఇంకో మార్గం ఉంది- మీరు వాళ్లకి చదివి పెట్టచ్చు-"

"అవున్లే, అట్లాగైనా వాళ్లకి మెల్లగా తెలుగు చదవటం వస్తుందేమో, చూస్తాను. కథలు చదవటం కోసమన్నా వాళ్ళు తెలుగు నేర్చుకుంటారేమో"

"తప్పకుండా నేర్చుకుంటారు చూడండి. అదేమంత బ్రహ్మవిద్య? తలచుకుంటే వాళ్ళు ఒక్క రోజులో నేర్చుకోగలరు. కథల్లో మాయ మీకు తెలీనిదా? మీరు చిన్నప్పుడు ఎన్ని కథల పుస్తకాలు చదవలేదు?"

"అవును నాయనా! ఇప్పుడు తెలుగు పుస్తకాలే కరువైపోతున్నాయి"

"ఏమీ లేదండీ! ఆదరించేవాళ్లు ఉంటే భాష చటుక్కున పుంజుకుంటుంది. ఏం చేసినా తెలుగులో అర్థమైనంత బాగా పరాయి భాషలో ఎంతమందికి అర్థమౌతుంది, చెప్పండి? ఏదో ఒక మాయ చెయ్యాల్సిందేనండీ. మీ పిల్లలకి 'తెలుగు రాదు' అని ఊరుకోకండి. ఏదో ఒకటి చేసి వాళ్ళ భాషని వాళ్ళకి ఇవ్వాలి- లేకపోతే కుదరదు."

"అంతేనంటావా?"

"అంతేనండీ- వేరే మార్గం లేదు. మాతృభాష తర్వాతే, వేరే ఏదైనా"

Typeset and Published by Narayana for Kottapalli Trust, Near M.R.O.Office, Chennekothapalli-515101, Ananthapur District, AP. Ph:08559 240222 E-mail: team@kottapalli.in

మంచిపుస్తకం:

పిల్లల పుస్తకం-పెద్దల పుస్తకం



ఒక కుక్క. దానికి ఆరు పిల్లలు. వాటికి స్వంత ఇల్లు లేదు.

ఆ కుక్క స్నేహితుడి దగ్గరకు వెళ్ళి, "నా పిల్లలు పెద్దయ్యే దాకా ఇంట్లో ఆశ్రయం ఇస్తావా?" అనడిగింది.

స్నేహితుడు ఆశ్రయం ఇచ్చాడు.

పిల్లలు పెరిగి బాగా పెద్దయ్యాయి.

"నీ పిల్లలు పెద్దయ్యాయి గదా, ఇంక ఇల్లు ఖాళీ చేస్తావా?" అనడిగాడు స్నేహితుడు.

కుక్క, దాని పిల్లలూ వరసగా నిలబడి పళ్ళు బయట పెట్టి "ఇల్లు ఖాళీ చేస్తాం, నువ్వు ఖాళీ చేయించగలిగితే!" అన్నాయి.

ఈ కథా, కాకికి దాహం వేసే కథా, పుల్లటి ద్రాక్షపళ్ళ కథ, రెండు కుండల కథ, తోడేలు పిల్లనగ్రోవి కథ- ఇంకా తెలిసినవీ, తెలీనివీ ఓ తొంభైకి పైగా కథలు ఉన్నాయి "పిల్లల పుస్తకం.." పుస్తకంలో. ఒక రేగుపండు తిన్న పిల్లలు ఇంకో రేగుపండు తింటారట. ఒక కథ చదివిన పిల్లలు ఇంకో కథ చదువుతారట. నిజంగా నిజం అనిపిస్తుంది ఈ పుస్తకం చదవటం మొదలు పెట్టాక.

జనాల నోళ్లలో నానుతున్న ఈ కథల్ని సేకరించి, చిన్న పిల్లలకు కూడా అర్థం అయ్యేలా, మామూలు పదాల్ని ఉపయోగిస్తూ చాలా చక్కగా తిరగ రాసారు, సాకం నాగరాజు గారు.

పిల్లకాయలూ, పెద్దిత్తులూ అందరూ చదవాల్సిన పుస్తకం ఇది- అందుకే అట్లా పేరు పెట్టారట!

పిల్లల పుస్తకం- పెద్దల పుస్తకం

అభినవ ప్రచురణలు, తిరుపతి.

132 పేజీలు, వెల 100 రూపాయలు.